
# మహాత్ముల సందేశాలు

## బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో....

# మహాత్ముల సందేశాలు




రచన & ప్రచురణ : తటవర్తి రాఘవరావు

ప్రథమ ముద్రణ : డిశంబరు, 2024

కాపీలు : 2,000

వెల : రూ. 40/-



పుస్తకముల కొరకు

తటవర్తి వీర రాఘవరావు

తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.

సెల్ : 9440309812

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

**a)** ప్రతిరోజూ ఉదయం **Zoom** లో **4 to 6.30 a.m. Silence Meditation** మరియు **6.30 to 7.30 a.m.** వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

**Zoom I.D. :2413823868, Password : RAO**

**b)** పై కార్యక్రమము **6.30 to 7.30 a.m.** వరకు **Youtube**లో కూడా **Live** ఇవ్వబడుతుంది.

**c)** ఎవరైతే **TVR & TRL Whatsapp** గ్రూపులో వుంటారో వారికి **Zoom Link & You Tube Links** మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా **save** చేసుకోవాలి.

**d)** తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే **www.tst.org.in Open** చేసిన తర్వాత **Join in Whatsapp group** లింక్ మీద నొక్కండి.

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

**a) Whatsapp group** లో మీకు పంపబడుతున్న **Youtube** లింక్ మీద నొక్కినప్పుడు **Tatavarthy Veera Raghava Rao** ఛానెల్ **open** అవుతుంది. **Open** అవ్వగానే **subscribe** కనిపిస్తుంది. దాని మీద నొక్కితే **subscribe** అవుతారు. ప్రక్కనే వున్న **bell button** నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే **www.tst.org.in/videos/** ఓపెన్ అయిన తరువాత **I** లో **Tatavarthy Veera Raghava Rao** పేరు మీద నొక్కండి. **II & III** లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ **Open** అవుతాయి. **Open** అవ్వగానే **subcribe** కనిపిస్తుంది. దాని మీద నొక్కితే **subscribe** అవుతారు. ప్రక్కనే వున్న **bell button** నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

# మహాత్ముల సందేశాలు

మహాయోగులంతా ఎంతో కష్టపడ్డారు. గొప్ప సాధనలు చేసి, సత్యం తెలుసుకున్నారు, మానవుని దుఃఖానికి కారణం తెలుసుకున్నారు, దుఃఖం నుండి బయటపడే మార్గాన్ని తెలుసుకున్నారు అదే అందరికీ బోధించారు.

వారి బోధన యొక్క సారాన్ని గ్రహించి ఆచరించగలిగితే ఎవరికైనా దుఃఖమే రాదు, వచ్చిన దుఃఖం కూడా తేలికగా పోతుంది. అనేక సమస్యల వల్ల కలిగే బాధనే దుఃఖము అంటారు.

1) ముఖ్యంగా ఎవరిని చూసినా ఆరోగ్య సమస్యలు వున్నాయి.
2) భరించలేని ఆర్థిక సమస్యలు వున్నాయి.
3) కుటుంబ సమస్యలు వున్నాయి.
4) సంసార సమస్యలు అంటే భార్య భర్తల మధ్య వుండే సమస్యలు వున్నాయి.
5) ఇరుగుపొరుగు వారితో సమస్యలు వున్నాయి.
6) వార్ధక్య సమస్యలు అంటే ముసలి తనంలో వచ్చే సమస్యలు వున్నాయి.
7) ఎవరికీ తెలియని ఇంకొక సమస్య ఏమిటంటే? మరణానంతర జీవిత సమస్యలు.

ప్రతి మానవునికి ఇన్నిరకాల సమస్యలున్నాయి. ఎవరైనా సమస్యలుంటే తట్టుకోలేరు. సమస్యలు తీవ్రంగా వుంటే ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనుకాడరు.

ఇన్ని సమస్యలతో సతమతమవుతున్న మానవుని బయట పడేయడానికే యోగులు వారి జీవితాన్ని త్యాగం చేసారు. మానవులు ఎలా జీవిస్తే సమస్యల నుండి బయట పడి సంతోషంగా జీవించగలుగుతారు అన్నది తెలుసుకుని, ఎన్నో విషయాలు మానవులకు బోధించారు.

అలా వారు అనుభవపూర్వకంగా పొందిన జ్ఞానాన్నే మనందరికీ బోధించారు. అటువంటి వారు బోధించింది అంత తేలిగ్గా తీసిపడేయవలసిన

విషయం కాదు. వారు ఏమన్నారంటే **"నువ్వు ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్ళేటప్పుడు డబ్బు నీకు ఏమీ ఉపయోగపడదు, అలాగే ధనము భగవంతుని దగ్గరకు చేర్చలేదు", "ధనం, సంపదలు భగవంతుని పొందే మార్గంలో అవరోధాలే కలిగిస్తాయి"** అన్నారు.

ఈ ఆధ్యాత్మిక మార్గంలో మహాత్ములు ధనం గురించి ఎంత చెప్పారో ఒక్కసారి ఆలోచించండి. వారు ఏమన్నారంటే ధనం ఏమీ ఉపయోగపడదు. పైగా ఈ మార్గంలో ధనం అవరోధమే కలిగిస్తుంది అని చెప్పడం జరిగింది.

ఇప్పుడు మనమంతా కూడా ఆధ్యాత్మిక మార్గంలో ఎదగడానికి ప్రయత్నిస్తున్నాం, అంటే దుఃఖాన్ని తొలగించుకునే ప్రయత్నం చేస్తున్నాం. మరి దుఃఖం పోవాలి అంటే అన్ని రకాల సమస్యల నుంచి బయట పడాలి.

మీరు గొప్పవాళ్ళను ఎవరినైనా గమనిస్తే వారు ఈ మార్గంలోకి వచ్చిన తర్వాత ధనాన్ని వదిలేస్తారు, అంటే సంపాదన మీద దృష్టి పెట్టరు. వాళ్ళకి తెలుసు సడన్ గా వదిలేస్తే కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయని, అయినా సరే లెక్క చేయరు. అలా పత్రి గారిని గమనిస్తే ఆయన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయనకి జీతమే ఆధారం, అయినా సరే లెక్క చేయలేదు.

ధనం అన్నది ఈ మార్గంలో అవరోధమే, ఆటంకమే, అడ్డమే అని ఆయనకి తెలుసు. పత్రిగారు పరిచయం అయ్యాక నేను ఆత్మ అని తెలుసుకున్నాక, నాకు కావాల్సింది జ్ఞానం అని తెలుసుకున్నాను. జ్ఞానం సంపాదించడానికి ఈ ధనం అన్నది అవరోధము, ఆటంకము అన్నది నాకు కూడా అర్థమైంది. అందుచేత నా వ్యాపారాలన్నీ మానేశాను.

నేను వ్యాపారం చేస్తే టైం అంతా సంపాదనకే కేటాయించవలసి వచ్చేది. నేను ఉదయం ఎనిమిది నుంచి రాత్రి 10, 11 గంటల వరకు రకరకాల వ్యాపారాలు చేసేవాడిని. ఎక్కడా ఖాళీ ఉండేదికాదు. మరి ఖాళీ లేకుండా ధనం మీద దృష్టి పెడితే జ్ఞానం ఎక్కడ సంపాదిస్తాం? అందుకే లాభం లేదని అన్ని వ్యాపారాలు మూసేశాను. నా అభిప్రాయం ఒక గంట సంపాదన మీద ఉంటే ఆ గంట జ్ఞాన సంపాదన ఆగిపోతుంది.

అప్పటికే నేను 53 సంవత్సరాలు వృధా చేశాను, ఇంకేం వృధా

చేస్తాను? నాకు అవసరాల కంటే ఎక్కువే ఉంది, అందుకే వెంటనే వ్యాపారాలన్నీ మానేసాను.

అంతేకాదు  సంసారం గురించికూడా ఎంతో సమయం వెచ్చించే వాడిని, అందుకే పిల్లల్ని బయటకు పంపేశాను. పదవులన్నీ వదిలేశాను, స్నేహితుల, బంధువుల ఫంక్షన్లు, పార్టీలకు వెళ్ళడం మానేశాను. అవన్నీ నా జ్ఞాన సంపాదనకు అవరోధం క్రిందే ఉండేవి.

అలా చేసినప్పుడు నా సమయం 100 శాతం జ్ఞాన సంపాదనకే ఉప యోగించడానికి వీలైంది. లేకపోతే  ఈ స్థాయికి వచ్చి ఉండేవాడిని కాదేమో! పత్రిగారు ఒక సందర్భంగా ఏమన్నారంటే? నువ్వు ఎందులో ఛాంపియన్ అవ్వాలనుకుంటావో నిర్ణయించుకుని దానిమీదే దృష్టి ఉంచమన్నారు. ఆయనకూడా  అదే పని చేశారు. మరి నేను 20 సంవత్సరాల నుంచి అదే పని చేస్తే ఎదగకుండా వుంటానా? ఎవరైనా ఎదుగుతారు.

చాలామంది ఏమంటారంటే? మేము అది చేస్తున్నాము, ఇది చేస్తున్నాం అంటారు. మేము సంసారం చూసుకుంటూ, సంపాదన చూసుకుంటూ, పదవులు చూసుకుంటూ ఈ మార్గంలో ఉన్నాము అంటారు.

వుండొచ్చు ఎవరి ఇష్టం వారిది, ఎవరిదీ తప్పులేదు. కానీ జ్ఞాన సంపాదన మీద నువ్వు 10% దృష్టి వుంచితే 10% జ్ఞానం, 50% దృష్టి వుంచితే 50% జ్ఞానమే వస్తుంది.  90% ఫోకస్ చేస్తే 90% జ్ఞానమే వస్తుంది. అందుచేత ముందు మనం డిసైడ్ చేసుకోవాలి.

అసలు ముందు తెలుసుకోవలసింది మనం ఎవరం? మనకు కావల్సింది ఏంటి? ఏది మనకు ఉపయోగ పడుతుంది? ఏది మనకి లాభిస్తుంది?

అంతేకాదు  ఏది ఇహపరాల్లో లాభిస్తుంది అన్నది ముందు మనం తెలుసుకోవాలి.  మరి ఇహంలోనూ, పరంలోనూ లాభించేది  జ్ఞానం ఒక్కటే! కాని ధనం ఇహంలో మాత్రమే ఉపయోగపడుతుంది, కానీ పరానికి  రాదు, ఉపయోగపడదు కూడా.

సాధారణంగా మనం ఈ భూమిని ఇహలోకము అని  చెప్పుకుంటూ

వుంటాం, కనిపించని లోకాల్ని పరం అని అనుకుంటాం.  కానీ ఆత్మలమైన మనం దేన్ని పరమని అనుకుంటున్నామో అదే మనకి ఇహము. అలాగే అందరూ దేన్ని పరం అనుకుంటున్నారో! అదే మనకి ఇహము. అంటే ఏదైతే ఇహమని అనుకుంటున్నామో! అదే మనకి పరము అని తెలుసుకోవాలి.

ఉదా:– మనమంతా భారతదేశంలో ఉండేవాళ్ళమే కదా? అంటే భారతదేశం అన్నది మనకి స్వదేశం. అమెరికా మనకు పరదేశం. ఈ స్వదేశం నుంచి అమెరికా అంటే పరదేశం ఎందుకు వెళ్తాము?

అక్కడికి వెళ్లి ఉద్యోగం చేసి, వ్యాపారం చేసి, డబ్బు బాగా సంపాదించడానికి. సంపాదించి  ఏం చేస్తారు? స్వదేశానికి వచ్చి పొలం కొంటారు, ఇల్లు కడతారు, మంచి వ్యాపారం పెడతారు, బాగా సెటిల్ అవుతారు.

కొంతమంది ఆస్ట్రేలియా వెళ్తారు. కొంతమంది లండన్ వెళ్తారు, దుబాయ్ వెళ్తారు, ఇలా ఎవరి ఇష్టం వచ్చిన చోటుకి వాళ్ళు వెళ్తారు. ఏది ఏమైనా పరదేశంలో సంపాదించుకుని రావడానికి వెళ్తారు. అంటే స్వదేశంలో గొప్పవాళ్ళు కావడానికి వెళ్తారు.

అలాగే ఆత్మైన మనం మన స్వలోకమైన ఆ పరలోకం నుంచి భూమ్మీదకి వచ్చాం. అంటే ఇప్పుడు భూమి మనకి పరలోకం అయ్యింది.

అందుచేత ఇది అర్థం చేసుకుంటే?  మీరంతా ధ్యానమార్గంలోకి ఎందుకు వస్తున్నారు అన్నది అర్థమవుతుంది. సహజంగా మిమ్మల్ని చూసి అందరూ పిచ్చోళ్ళు అనుకోవచ్చు, కాని మిమ్మల్ని పిచ్చోళ్ళు అనేవారే పిచ్చోళ్ళు.

ఆత్మైన మీరు భూమిమీదకు వచ్చారు. వచ్చి ఇక్కడ పర్మనెంట్‌గా వుండిపోతారా? అంటే ఉండరు, కొన్నాళ్లే ఉంటారు. మరి అసలు వచ్చింది దేనికి? అంటే  జ్ఞానం సంపాదించడానికి.

అందుచేత ఆత్మైన మనం మన స్వలోకమైనటువంటి పరం నుంచి జ్ఞానం సంపాదించడానికి వచ్చాం.  మరల పరానికి వెళ్ళినప్పుడు ఆ జ్ఞానంతో ఇంకా గొప్ప లోకాలకి చేరుకుంటాం.

చూడండి డబ్బు సంపాదన కోసం ఒంట్లో బాగున్నా – బాగోపోయినా, ఓపికఉన్నా – లేకపోయినా వెళ్లి సంపాదిస్తారు. అలాగే జ్ఞానం సంపాదించాలి. అలాగే అమెరికా వెళ్ళినోళ్ళు స్వదేశానికి తిరిగివచ్చినప్పుడు అక్కడ అన్నీ వదిలేసి వచ్చేస్తారు.

అలాగే ఈ భూమి పరలోకం అని మనకు అర్ధమయితే ఇక్కడ వున్నవి, వున్నవారిని వదిలేయడానికి ఏమి బాధపడరు, ఎవరైనా చనిపోయినా భాధపడరు.

మా మేడం అమ్మగారికి 90 ఏళ్ళు. చనిపోయింది రమ్మని ఖరగ్‌పూర్ నుంచి బ్రదర్స్ ఫోన్ చేశారు. ఆవిడ ఏమందంటే, ఇప్పుడు నేను బయలుదేరినా అక్కడికి వెళ్ళేసరికి ఆవిడని తీసుకుపోతారు, వెళ్లి ఏం చేయను? 3 రోజుల క్లాస్ అయ్యాక వస్తాను అంది. ఇంకా వారితో ఏమంది అంటే? అంత వయసు వచ్చాక వెళ్ళకుండా వుంటుందా? బాధపడకండి అని చెప్పింది. అది జ్ఞానమంటే?

భగవద్గీతలో చెప్పాడు కదా?

**శ్లో॥ "గతాసూ నగతాసూంశ్చ నానుశోచన్తి పండితాః" (భ.గీ.2-11)**

గతించిన వాడి గురించి గాని, గతించబోయే వాడి గురించి గాని ఎవడైతే శోకించడో వాడే పండితుడు, అంటే జ్ఞానంలో బాగా పండినవాడు అని శ్రీకృష్ణుల వారు చెప్పారు కదా?

అలాగే తండ్రి పోవచ్చు, తల్లి పోవచ్చు, భర్త పోవచ్చు, భార్య పోవచ్చు, పిల్లలు పోవచ్చు, కానీ సాధారణంగా ఉన్న ఆ మమకారంతో కాసేపు బాధపడడం అన్నది సహజం, అంతేగానీ పర్మనెంట్ గా ఎడుస్తూ కూర్చోవడం అన్నది చాలా మూర్ఖత, అజ్ఞానం అని పత్రిగారు అన్నారు.

అందుచేత ధనమే కాదు అన్నీ వదిలి పెట్టవలసినవే! ఏది కూడా రాదు. ఆత్మైన మనకు దేనితో సంబంధం లేదని తెలుసుకోవాలి.

మనం పరంలో ఏదో ఒక లోకం నుంచి వచ్చి తల్లి గర్భంలో తయారయ్యే శిశువులో ప్రవేశించాం. తాత్కాలికంగా ఇక్కడ కలిశాం. అంతకన్నా ఏ సంబంధం లేదు, మళ్లా ఎవరి దారిని వాళ్ళు వెళ్ళిపోతారు.

# మూడు రకాల జీవితాలు

మహాత్ములు ఏమన్నారంటే? **"మానవులకు మూడు రకాల జీవితాలు వుంటాయి"** అని చెప్పారు. అవి

**1) రాత్రి జీవితం, 2) సంధ్యా జీవితం, 3) పగలు జీవితం**

అలా మానవ జీవితం, జీవించే వారిని మూడు రకాలుగా విభజించుకోవచ్చు.

ఇక్కడ మీరు చూడండి రాత్రి జీవితానికి పగలు జీవితానికి మధ్యలో ఉన్నదాన్ని సంధ్యా జీవితం అంటారు. అలాగే పగలు జీవితానికి రాత్రి జీవితానికి మధ్యలో ఉన్న జీవితాన్ని కూడా సంధ్యా జీవితం అంటారు. ఒకటి రాత్రి సంధ్య, రెండోది పగలు సంధ్య.

**1)రాత్రి జీవితం :-** అంటే పూర్తిగా అజ్ఞానంలో ఉన్నటువంటి జీవితం. ఇటువంటి వారికి ఏమీ తెలీదు, ఏం చేస్తున్నారో తెలీదు, ఏం చెయ్యాలో తెలీదు, ఏం మాట్లాడుతున్నారో తెలీదు, ఏం మాట్లాడాలో కూడా తెలీదు, అలాగే ఏం ఆలోచిస్తున్నారో తెలీదు, ఏం ఆలోచించాలో కూడా తెలీదు.

వీళ్ళు అన్ని విషయాల్లో పూర్తి విరుద్ధంగా జీవిస్తారు, చేయ కూడని పనులు చేస్తారు, మాట్లాడకూడని మాటలు మాట్లాడతారు, ఆలోచించకూడనివి కూడా ఆలోచిస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల చేసిన వాటి పర్యవసానంగా కష్టాలు తెచ్చుకుంటారు, సమస్యలు తెచ్చుకుంటారు, విపరీతమైన దుఃఖానికి లోనౌతారు. పెద్దలు అంటే మహాత్ములు ఇటువంటి వారిని ఏమని పేర్కొన్నారంటే కళ్ళున్న గుడ్డివారిగా పేర్కొన్నారు.

వీళ్ళకి జీవితంలో సుఖశాంతులు ఉండవు. ఎందుచేతనంటే చేయవలసింది చేస్తే సుఖం ఉంటుంది, శాంతి ఉంటుంది. విరుద్ధంగా చేస్తే సుఖం ఎక్కడ ఉంటుంది? శాంతి ఎక్కడ ఉంటుంది? వీళ్ళకి సృష్టి నియమాలు తెలీవు, సృష్టి ధర్మాలు తెలీవు, సృష్టి సిద్ధాంతాలు కూడా తెలియవు. సృష్టిలో ఇవన్నీ ఉన్నాయన్న సంగతి కూడా తెలీదు.

ఎంతసేపు నాకు తెలిసిందే కరెక్టు, నేను చేసేదే కరెక్టు అనుకుంటారు. ఇంకొకళ్ళు చెప్పినా వినరు, వినిపించుకోరు. నాకంటే నీకు ఎక్కువ తెలుసా? అంటారు. పెద్దలు, మహాత్ములు చెప్పిన సందేశాలు వినరు, అర్థం చేసుకోరు, ఆచరించరు. వీరి ప్రవర్తన చాలా మూర్ఖంగా ఉంటుంది, తాను పట్టుకున్న కుందేలుకి మూడే కాళ్ళు అనే రకం. వీళ్ళల్లో మార్పు రావాలి అంటే చాలా జన్మలు తీసుకోవాల్సి ఉంటుంది.

**2) సంధ్యా జీవితం:-** ఇది రెండు రకాలు.

**ఎ) పగలు సంధ్య:-** రాత్రి పోయి పగలు వస్తూ ఉంటే, ఉండే సంధ్య పగలు సంధ్య.

**బి) రాత్రి సంధ్య :-** పగలు పోయి మళ్లీ చీకటి పడుతుంటే, ఉండే సంధ్య రాత్రి సంధ్య.

మానవులు అజ్ఞానంలో కొన్ని జన్మలు గడిచిపోయిన తర్వాత కొంచెం జ్ఞానం పొందే ప్రయత్నం చేస్తారు. దానికి కావలసినటువంటి సాధన, స్వాధ్యాయం, సాంగత్యం కూడా చేస్తారు. గురువుల దగ్గర కొద్దిగా జ్ఞానం కూడా నేర్చుకుంటారు. వీళ్ళకి ఆసక్తి ఉంటుంది కానీ, శ్రద్ధ ఉండదు. వీళ్ళు ఏదైనా ఆధ్యాత్మిక  కార్యక్రమానికి వెళ్ళాలనుకుంటారు కాని వెళ్ళలేరు, ఏదో ఆటంకం వస్తుంది.

పిల్లలు, సంసారం, సమస్యలు ఇలా ఎన్నో ఉంటాయి. ఏం చేస్తారు? అన్నీ చేయాలనుకుంటారు, కాని ఏది చేయలేరు. తెలియదా అంటే అన్ని తెలుసు, కానీ ఆచరించలేరు. ఊరికే చేయాలని, వెళ్లాలని అనుకుంటారంతే. వీరు అనుకోవడంతో సరిపెడతారు. మీకు మీరు గమనించుకుంటే మీరు ఏ స్థాయిలో ఉన్నారో మీకు అర్థమవుతుంది.

మహాత్ములు ఊరికే చెప్పరండి, వాళ్ళు మనల్నందరినీ కాసి వడపోశారు. సంధ్యా జీవితంలో ఉన్నవారి జీవితం ఎలా ఉంటుంది అంటే? జ్ఞానాన్ని తెలుసుకుంటారు కానీ ఆచరించరు.

1) నువ్వు ఎవరు అంటే? ఆత్మవు అని చెప్తారు, కానీ ఆత్మ అన్నట్టుగా జీవించరు. చాలా మంది నేను ఆత్మను అని వింటున్నారు, కాని ఇంటికి వెళ్లేక ఆత్మ అన్నట్టుగా జీవిస్తున్నారా? అంటే లేదనే చెప్తారు. అంటే సంధ్యా జీవితంలో ఉన్నట్టే. విన్నది ఆచరిస్తే పగటి జీవితము. విన్నా, తెలుసుకున్నా ఆచరించకపోతే సంధ్యా జీవితం. విన్నా అర్థం కాలేదు అంటే వాడిది రాత్రి జీవితం.

2) విగ్రహారాధన చేయకూడదు అంటే కరెక్టే అంటారు, కానీ చేస్తూనే వుంటారు. విగ్రహం కనపడగానే దూరంగా ఉన్న చేతులు కూడా దగ్గరికి వచ్చేస్తాయి. కాని విగ్రహం దేవుడా అంటే? కాదు అంటారు. దేవుడు ఎవరు అంటే ఆత్మ అంటారు. వీరిది సంధ్యా జీవితం.

3) ధ్యానం అంటే "శ్వాస మీద ధ్యాస" అని బోర్డు మీద వ్రాస్తారు. కానీ చేసేది, చెప్పేది మ్యూజిక్ మీద ధ్యాస, గైడింగ్ మీద ధ్యాస. వీరిది సంధ్యా జీవితం.

4) పొద్దున్నే లేవాలనుకుంటారు లేవలేరు.

5) భీమవరం రావాలనుకుంటారు కానీ రాలేరు. కొంతమంది ఆరేళ్ళ నుంచి వద్దామని అనుకుంటున్నాం కాని రాలేక పోతున్నాం అంటారు.

6) జూమ్ లో వీడియో ఆన్ చేయాలనుకుంటారు ఆన్ చేయలేరు.

7) గురువు గారితో మాట్లాడాలనుకుంటారు మాట్లాడలేరు.

8) ధ్యానం బాగా చేయాలనుకుంటారు చేయలేరు.

9) పుస్తకాలు చదవాలనుకుంటారు చదవలేరు. ఇలాంటి వారంతా సంధ్యా జీవితంలో ఉన్నట్టే!

ఈ సంధ్య జీవితంలో ఉన్న వాళ్ళు తాడుని చూసి పామనుకుంటారు. చీకట్లో వెళ్లే దారిలో ఓ తాడు పడి ఉంది, పూర్తి వెలుతురూ కాదు, పూర్తిగా చీకటీ కాదు. ఆ తాడు మెలికలు తిరిగి వుంటుంది. వీళ్ళకి చాలా డౌట్ వస్తుంది. అది తాడా? పామా? కదలదు కానీ పాములాగే ఉంది. పొరబాటున

దగ్గరికి వెళ్తే కదులుతుందేమో! అని వీళ్లు చాలా డైలమాలో ఉంటారు. అలాంటి వాళ్ళ జీవితం సంధ్యాజీవితం.

ఎండాకాలంలో ఎండమావులను చూసి నీరు అనుకుంటారు, దగ్గరికి వచ్చేదాకా కూడా అర్థం కాదు. ఇలాంటి వారందరిది సంధ్యా జీవితం. తెలీదా? అంటే తెలుసు, ఆచరిస్తారా? అంటే ఆచరించరు.

అజ్ఞానం నుంచి జ్ఞానంలోకి రావడమే సంధ్య జీవితం అంటారు.

**3) పగటి జీవితం:-** ఇది పూర్తిగా జ్ఞానం పొందిన జీవితం, వీరి జీవితం పగటి జీవితం. వీరు పూర్తిగా జ్ఞానులు అవుతారు, చేయవలసినవన్నీ చేస్తూ వుంటారు, మాట్లాడవలసిందే మాట్లాడతారు, ఆలోచించవలసిందే ఆలోచిస్తూ వుంటారు, సరైన విధంగా జీవిస్తారు.

వీరి జీవితం అంతా వీళ్ళకి లాభం కలిగిస్తుంది, వీరి జ్ఞానం అలా అపారంగా పెరగడం వల్ల వీళ్ళు కర్మలను కూడా దగ్ధం చేసుకుంటారు, కర్మలు ఎప్పుడైతే లేవో మోక్షాన్ని కూడా పొందుతారు. ఇప్పుడు మన వాళ్ళు చాలామంది ఈ స్థాయిలోకి ఉన్నారు.

ఈ మూడు రకాల వాళ్ళని పత్రి గారు ఏమన్నారంటే? అజ్ఞుడు అంటే రాత్రి జీవితంలో వున్నవారు, అల్పజ్ఞుడు అంటే సంధ్య జీవితంలో వున్నవారు, విజ్ఞుడు అంటే పగటి జీవితంలో వున్నవారు అన్నారు. అంటే ఇక్కడ పత్రి గారు ఎలా ఉదాహరించారు అంటే పూర్తిగా అజ్ఞానంలో ఉన్నవారు, కొంత అజ్ఞానం తొలగించుకుని కొంత జ్ఞానం పొందుతున్నవారు, మూడో రకం పూర్తి జ్ఞానం సంపాదించుకున్న వారు.

ఎందుకంటే? మనమంతా కూడా జ్ఞాన మార్గంలో ఉన్నాం. ప్రతి ఒక్కరు రకరకాల స్టేజీల్లో ఉంటాం, కచ్చితంగా అందరూ ఎదుగుతారు, కానీ వారి శ్రద్ధను బట్టే ఉంటుంది. ఊరికే ఒక్కసారిగా మొత్తం జ్ఞానం ఎలా వస్తుంది? దానికి కష్టపడాలి, కృషి చేయాలి.

పత్రిగారు అజ్ఞానం తొలగించుకొని జ్ఞానం పొందాలి అంటే మూడు

ఆధ్యాత్మిక త్రిరత్నాలు చెప్పారు. అవి

1) సాధన, 2) స్వాధ్యాయం, 3) సాంగత్యం

ఈ మూడు పట్టుకుని భూమిని వదిలి వెళ్లే లోపులోనే జ్ఞానాన్ని సంపాదించుకోవాలి.

లోకంలో రకరకాల గుణాల వారు ఉంటారు, వారి గుణాన్ని బట్టి వారి ప్రవర్తన ఆధారపడి ఉంటుంది. అందరి గుణాలు ఒకే రకంగా ఉండవు, అందుచేత అందరి ప్రవర్తన ఒకే రకంగా ఉండదు. గుణాలవల్ల ఈ తేడాలు తప్పనిసరి.

వారి ప్రవర్తన బట్టి వారు ఏ గుణంలో ఉన్నారో చెప్పవచ్చు. మీ ప్రవర్తన గమనిస్తే మీగుణం అర్థమవుతుంది. దాన్ని బట్టి మిమ్మల్ని మీరు సరి చేసుకోవచ్చు. గుణం మారాలి అంటే తీవ్ర ధ్యాన సాధన చేయాలి, శక్తి అపారంగా పెంచుకోవాలి, ఆహార నియమాలు కచ్చితంగా పాటించాలి.

ఈ రకంగా చేస్తున్నప్పుడు మీకు తెలియకుండా మీ శక్తి పెరుగుతుంది, మీ శక్తి పెరిగే కొద్దీ మీ మనసు శుద్ధి అవుతుంది. మనసు శుద్ధి అయ్యే కొద్ది, గుణం మారుతుంది, గుణం మారే కొద్ది మనిషి ప్రవర్తన మారుతుంది, పనులు మారతాయి, మాటలు మారతాయి, ఆలోచనా విధానం మారుతుంది.

అలాంటి మార్పుల వల్ల రాక్షసుడు మానవుడు అవుతాడు, మానవుడు మహాత్ముడు అవుతాడు, చివరకు మహాత్ముడు పరమాత్ముడు అవుతాడు.
అది స్త్రీ అయినా, పురుషుడైన సరే.

ఇలాంటి మార్పులు రాకపోతే మీరు చేసే ధ్యానం, మీరు పడిన కష్టము, శ్రమ, ఖర్చుపెట్టిన ధనం అన్ని వృధాయే! ఈ ధ్యాన మార్గంలోకి వచ్చారు అంటే ఈ మార్పులు వచ్చి తీరాల్సిందే. ఇటువంటి మార్పులు మీరు సాధించగలిగితే ఇహ పరాలలో ఉండే మీ భవిష్యత్తు, గొప్పగా మారిపోతుంది, మారాలి కూడా.

మీ సాధన అదే రకంగా కొనసాగిస్తే మీ పనులు లోకంలో ఉన్నవారికి

ఆశ్చర్యం కలిగిస్తాయి. ఏంటి వీడు ఇలా మారిపోయాడు అని ఆశ్చర్యపోతారు, ఆశ్చర్య పోవాలి కూడా. బయటి వారే కాదు మీ ఇంట్లో వారే ఆశ్చర్య పోతారు. ఇటువంటి మార్పులు ఈ క్లాసులలో పాల్గొన్న వారిలో గమనించవచ్చు.

ఆర్మూర్ జనాభాయ్ మేడమ్ రాత్రి అంతా కూర్చొని ధ్యానం చేశాను అని చెప్పింది. నా దృష్టి ఎంతసేపు అందరూ బాగుండాలి. ఆవిడలాగే అందరూ చెయ్యాలి, అందరూ ఎదగాలనే నా ప్రయత్నం, అందరూ మారితే ప్రపంచం ఎంత మారిపోతుంది? అదే పత్రీజీ గారి ఆశయం, నా ఆశయం కూడా!

ప్రస్తుత పరిస్థితిని చూసి మిమ్మల్ని మీరు తక్కువ అంచనా వేయవద్దు, ప్రతి ఒక్కరూ గొప్పవారే. ఒకసారి వైజాగ్ దగ్గర ట్రెక్కింగ్ పెట్టారు. ఆ ట్రెకింగ్‌లో ఎక్కడపడితే అక్కడ పడుకునే వారు, ఒక చీమ కూడా కుట్టేది కాదు, ఒక దోమ కుట్టేది కాదు, పాము కరిచేది కాదు. అప్పుడు అనుకున్నా పత్రీజీ వైబ్రేషన్స్, ఆయన ఆరా శక్తి అటువంటిది అని.

అక్కడ మాటల సందర్భంలో ఎవరు గొప్పవారు అనే ప్రస్తావన వచ్చింది. నేను ఏమనుకున్నాను అంటే బాగా డబ్బు ఉన్నవారు గొప్పవారు, అధికారంలో ఉన్నవారు గొప్పవారు, పదవి ఉన్నవారు గొప్పవారు, ఐఏఎస్ అధికారి, ఐపీఎస్ అధికారి గొప్పవారు ఇలా భావించే వాడిని. అడుక్కునేవాడు హీనమైన వాడు, కన్నాలు వేసేవాడు, దొంగతనం చేసేవాడు, పేదవాడు చాలా హీనమైన వాడు అనే ఇదే అభిప్రాయంలో ఉండేవాడిని. అదే పత్రి గారితో అన్నాను.

అప్పుడు ఆయన తిట్టారు, అందరూ గొప్పవారే అన్నారు. ఆశ్చర్య పోయాను అదేంటి డబ్బున్న వాడు, పదవులు ఉన్నవాడు గొప్పవాడు అంటే అందరూ గొప్పవారు అంటారు. దానికి వివరణ అడిగే ధైర్యం అప్పుడు నాకు లేదు.

తర్వాత తర్వాత నా జ్ఞానం పెరిగే కొద్దీ ఎందుకు అన్నది అర్థమైంది. ఇదంతా ఎందుకు చెబుతున్నాను అంటే? మీలో చాలామందికి అల్ప భావం ఉంది. నేను పనికిరాని దాన్ని , పనికిరాని వాడిని, ఏమీ చేయలేని వాడిని,

ఏమి చేయలేని దాన్ని, నేనెక్కడా? వాళ్ళెక్కడా? ఇలాంటి భావంతో ఉన్నారు. కానీ పత్రిగారు అందరూ గొప్పవారే అన్నారు. నాకు అన్నమాచార్యుల వారు పాడిన పాట వల్ల అర్థమయ్యింది.

"బ్రహ్మమొక్కటే పర బ్రహ్మ మొక్కటే అని పాడుతూ... హీనాధికము లెందూ లేవు, అందరికీ శ్రీహరే అంతరాత్మ" అని స్పష్టంగా అన్నమాచార్యుల వారు చెప్పారు.

కారణం అందరిలో ఉన్నది ఆ శ్రీహరేకాబట్టి. అందరిలో శ్రీహరి వుంటే ఎవరు ఎక్కువ? ఎవరు తక్కువ? అనంత శక్తి కలిగిన ఆత్మ ప్రతి ఒక్కరిలో ఉంది. అందుచేత ఒకడు ఏమి చేయగలడో! రెండో వాడు కూడా అదే చేస్తాడు. ఒకడు ఏమి సాధిస్తాడో! రెండో వాడు అదే సాధిస్తాడు. ఒకడు ఏ స్థాయికి ఎదిగాడో! రెండో వాడు అదే స్థాయికి ఎదుగుతాడు. అందుచేత ఎక్కువా లేదు, తక్కువా లేదు అని తెలుసుకోవాలి.

అన్నమాచార్యుల వారి పాట విన్నాక పత్రి గారు చెప్పింది సత్యం అని అర్థమైంది. పత్రి గారు సత్యమే చెబుతారు కాని అసత్యం చెప్పరు, అంత గొప్ప వారు పత్రిగారు.

అన్నమాచార్యుల వారు ఎంత స్పష్టంగా చెప్పారు. "హినాదికములు ఎందూలేవు, అందరికీ శ్రీహరే అంతరాత్మ." అన్నారు. అంటే ప్రతి ఒక్కరి అంతరంలో ఉన్న ఆత్మే ఆ శ్రీహరి.

కాని ఒక సందేహం రావచ్చు! మరి ఎందుకండి ఇన్ని తేడాలు అని అడగవచ్చు. మేము మీలా ఎందుకు చేయలేక పోతున్నాము, మీలా ఎందుకు మాట్లాడలేక పోతున్నాము, మీలా ఎందుకు చెప్పలేక పోతున్నాము అని అడగవచ్చు. కాని ఈ తేడా అన్నది గుణం వల్లనే!

నిన్ను నువ్వు తక్కువగా భావిస్తున్నావంటే? దానికి కారణం నీలో వున్నటువంటి గుణం. ఆ గుణం వల్లనే తక్కువగా భావిస్తున్నారు. ముందు ఆ భావం పోవాలి అంటే , గుణం మారాలి. గుణం మారాలి అంటే మనసు

శుద్ధి కావాలి, మనసు శుద్ధి కావాలి అంటే మీ శక్తి పెరగాలి, శక్తి పెరగాలి అంటే

1. తీవ్ర ధ్యాన సాధన చేయాలి, 2. ఆహార నియమాలు పాటించాలి.

ఈ రెండు పనులూ చేయాలి. ముమ్మిడివరం బాలయోగి గారు అన్ని సంవత్సరాలు అలా కూర్చున్నారంటే ఎంత శక్తి సంపాదించుకున్నారు. ధ్యానం అలవాటైతే గంటలు నిమిషాల్లా గడిచిపోతాయి, మీకు కూర్చున్నట్లే ఉండదు.

ఆరు మాసాలు అలా తీవ్రంగా ధ్యాన సాధన చేస్తూ ఈ నియమాలు పాటిస్తూ ఉంటే మానవుడు కచ్చితంగా మహాత్ముడు అవుతాడు. ఇంతకన్నా సాధించ వలసింది ఏముందండి. మానవుడు మహాత్ముడు అవ్వాలి అంటే 300 జన్మలు పడుతుంది. అది మీరు ధ్యానం ద్వారా ఆరు మాసాలలో సాధిస్తారు.

ఇంకా శక్తి పెరిగే కొద్ది బుద్ధి వికసిస్తుంది, వివేకం కలుగుతుంది, విచక్షణా జ్ఞానం కలుగుతుంది, జ్ఞానం పెరుగుతుంది. జ్ఞానం అగ్నిలా ప్రజ్వలిల్లినప్పుడు కర్మలు కూడా రహితం అవుతాయి . ఎప్పుడైతే కర్మలు రహితం అవుతాయో మీకున్న అవసరాలు బట్టి ప్రకృతి మీకు అతీంద్రియ శక్తులు కల్పిస్తుంది. ఎదుటివారి మనసులో అనుకున్నది తెలుస్తుంది. దివ్య నేత్రం ఆక్టివేట్ అవుతుంది, సూక్ష్మ శరీరయానం చేస్తారు, అవసరమైతే గత జన్మలు చూసుకుంటారు.

ఈ శక్తులు ఉపయోగించుకొని మీ జ్ఞానాన్ని ఇంకా పెంచుకుంటారు. జ్ఞానాన్ని పెంచుకోవడం కాదు, సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటారు. అదే పరాకాష్ట అని పత్రీజీ చెప్పడం జరిగింది. అటువంటివారికి సత్య లోకం చేరే అర్హత వస్తుంది.

# గుణాన్ని బట్టే కర్మలు

**"మానవుని యొక్క గుణాన్ని బట్టే వారు చేసే పనులు ఆధారపడి వుంటాయి, వారి మాటలు ఆధారపడి వుంటాయి, వారు చేసే సేవలు ఆధారపడి వుంటాయి",** ఈరోజు మనం ఏ గుణంలో వున్నవారు చేసే దానధర్మాలు ఏ విధంగా వుంటాయో తెలుసుకుందాం.

## తమో గుణం

ఈ తమో గుణంలో ఉన్నవారు ఎటువంటి దానధర్మాలు చెయ్యరు. వారికున్న ధనాన్ని వారు మందు త్రాగడానికి, ఇతరులను తాగించడానికి వినియోగిస్తారు.

ఆ మందు షాపుల్లో, ఆ బీర్ షాపుల్లో త్రాగడానికి ఉపయోగిస్తారు. వారివద్ద మిగిలిన డబ్బు వారు స్పృహ లేకుండా పడి వునప్పుడు ఎవరో ఒకరు దోచుకుంటారు. ఆ సంగతి కూడా వారికి తెలియదు, కాసేపటికి ఆ మత్తు వదిలిపోతుంది, అప్పుడు జేబులు తడుముకుంటారు ఏమవుతుంది జేబు ఖాళీగా ఉంటుంది.

అప్పుడు డబ్బు పోయిందని ఏడుస్తూ కూర్చుంటారు. ఇంకా ఏమి చేయాలో తెలీక వారినీ వీరినీ తిడుతూ వుంటారు. ఆ కోపంలో ఆవేశంలో తూలుతూ వెళ్తూ ఏ గోడకో గుద్దుకుంటారు, లేకపోతే ఏ చెట్టుకో తగులు కుంటారు. దానివలన మరలా దెబ్బలు తగులుతాయి, మళ్ళా బాధపడతారు, ఇది తమో గుణంలో ఉన్నవారి పరిస్థితి.

ఆ మత్తులో వారిని వీరిని కొడతారు, వాళ్లు ఊరుకుంటారా, కేసు పెడతారు. మరలా కొత్తగా కేసు ఒకటి మీద పడుతుంది. దానికోసం ఆ ప్లీడర్ గారికి ఫీజు, ఆ డిపార్ట్మెంట్ కి లంచాలు ఇలా ఉంటుంది వీడి బ్రతుకు. అలాంటి వారి బ్రతుకు ఇహంలో చాలా హీనమైన బ్రతుకు అవుతుంది.

ఇలాంటి పనులు చేసిన వారు చనిపోయిన తర్వాత నరకానికి వెళ్తారు. వెళ్లడమే కాదు, మరల జన్మ తీసుకున్నా నీచమైన జన్మ లభిస్తుంది. ఇలాంటి వారి దుస్థితి భగవంతుడికే తెలియాలి, అలా ఉంటుంది వారి బ్రతుకు.

వాళ్లకి చాలా జన్మలు ఇలా గడిచిపోతాయి. వారు ప్రక్క వాడిని చూస్తారు, కంపేర్ చేసుకుంటారు. ఇది కాదు జీవితం అంటూ కొంత మార్పు తెచ్చుకుంటారు. ఇలాంటి వారికి వెంటనే మార్పు రాదు, మెల్లిగా గుణం మారుతుంది. గుణం మారాలంటే 100, 150 జన్మలు పడుతుందని పత్రి గారు చెప్పారు. అలా చచ్చీ చెడి, తమోగుణం నుంచి రజోగుణంలోకి వస్తారు.

## రజో గుణం

ఈ రజోగుణంలోకి వచ్చిన వారు గొప్పలకోసం ఖర్చు పెడతారు, వారి ధర్పం చూపించడానికి ఖర్చు పెడతారు, ఆడంబరంగా కనిపించడానికి ఖర్చు పెడతారు, పేరు ప్రఖ్యాతల కోసం ఖర్చు పెడతారు.

వీరు పెట్టే ఖర్చు ఎలా ఉంటుందంటే ఎమ్మెల్యే గారో, ఎంపీ గారో, ముఖ్యమంత్రి గారో, వీరి ఊరికి వస్తున్నారని తెలుస్తే వీడింటికే వస్తున్నట్టు, వీడి వీధికే వస్తున్నట్టు హడావుడి చేస్తారు. ఊళ్లో పెళ్ళికి కుక్కల హడావుడి అంటారు చూడండి అలా వుంటుంది వీరి హడావుడి.

ఆయన ఎవరింటికో వస్తాడు. ఈ విషయం అందరికీ చెప్పాలి అని పాంప్లెట్లు వేస్తాడు, వీడే బ్యానర్లు కట్టించడం, లాంటి హడావుడి చేస్తారు. ఇదంతా రజో గుణ లక్షణం.

అంతేకాదు వాళ్లకి ఇంకా ఏమైనా కావాలి అంటే మందు, విందు కూడా ఏర్పాటు చేస్తారు, ఇలా ఖర్చు పెడతారు. చివరికి వీరు చేసే పనుల వల్ల పుణ్యము ఉండదు, పురుషార్థం ఉండదు.

అలా ఉంటాయి వీరు పెట్టే ఖర్చులు. అలా ఇంకో 100, 150 జన్మలు గడిచిపోతుంది. మెల్లిగా గుణం మారుతుంది సాత్విక గుణంలోకి వస్తారు.

## సాత్విక గుణం

సాత్విక గుణం వారికి దైవం మీద ఆసక్తి ఉంటుంది, ఓర్పు సహనం కూడా ఉంటుంది, కొద్దిగా దాన ధర్మాలు చేస్తారు, అన్నదానం, వస్త్ర దానం, ఇలా రకరకాల దానాలు, శ్రమదానం చేస్తారు. ఏ దానం చేసినా, ఏ పని చేసినా అది పది మందికి ఉపయోగ పడేటట్టు చూసుకుంటారు.

ఏ రంగంలో ఉన్నా ఇలా దానాలు చేయడం, సహాయం చేయడం ఆర్థికంగా తోడ్పాటు చేయడం, సహాయ సహకారాలు అందించడం చేస్తారు.

కడ్తాల్ లో చూడండి ఎంతమంది ఎన్ని రకాలుగా ఇస్తున్నారు. ఇది కూడా సాత్విక గుణ లక్షణమే. అలా డబ్బు ఇచ్చే వారు ఉన్నారు, శ్రమదానం చేసేవారు ఉన్నారు, వాక్కుని ఇచ్చేవారు ఉన్నారు, ఇలా అన్ని రకాలుగా సేవ చేస్తే సాత్విక గుణంలోకి వచ్చినట్టే.

మీరంతా కూడా ఏదో ఒకటి చేస్తున్నారు, చేయకుండా మాత్రం ఎవ్వరు లేరు, ఎవరి స్థాయిలో వారు చేస్తున్నారు. అలా ఇవ్వడం అన్నది సాత్విక గుణ లక్షణం.

అలా సాత్విక గుణం పెరిగేకొద్దీ వీరు ఇచ్చేది ఇంకా పెరుగుతుంది. ఒకవేళ మీకు ఇవ్వాలని అనిపించక పోతే మీరు ఇంకా సాత్విక గుణంలోకి రాలేదని లెక్క. ఇవ్వలేక కాదు, ఇవ్వాలని లేకపోవడమే! చాలామంది చందాలకి బాగా డబ్బున్న వారి దగ్గరకు వెళ్తారు. కాని డబ్బున్నంత మాత్రాన ఇవ్వలేరు.

అందుకే "డబ్బున్న వాడు ఇవ్వలేడు, మనసున్నవాడు ఇస్తాడు" అంటారు. సాత్వికగుణం ఉన్న వాడికి జీవుల పట్ల, జంతువుల పట్ల, దయా గుణం ఉంటుంది. అలాంటి లక్షణాలు ఉన్నవారు శాఖాహార ర్యాలీలు చేయడం, పిరమిడ్లు కట్టించడం ఇలాంటివి చేస్తూ ఉంటారు. సాత్విక గుణ స్థితిని బట్టి చేసేవన్నీ ఆధారపడి ఉంటాయి.

ఇక్కడ పదిమందికి ఉపకారం చేసేవాడు సజ్జనులు. పదిమందికి అపకారం చేసేవారు దుర్జనులు.

చూడండి నీటిని ఎంత పవిత్ర స్థలంలో ఉంచినా ఆ నీరు పల్లం వైపుకే వెళ్తుంది. అలాగే ఎంత అపవిత్ర ప్రదేశంలో ఉంచినా మంట పైకే వెళు తుంది. అలాగే సజ్జనులు బ్రతికున్నప్పుడే కాదు, ఏ సమయంలో అయినా, ఏ సందర్భంలో అయినా సరే మంచే చేస్తూ ఉంటారు. ఆఖరికి మంచి చేసే చనిపోతారు.

పత్రి గారిని గమనిస్తే మనకి తెలుస్తుంది అందరికీ ఏదో రకంగా లాభం, మేలు కలిగించాలని చూశారు. మనం గమనించాము పత్రి గారు ప్రాణాలు పోయేదాకా ఏదో రకంగా సేవ చేస్తూనే ఉన్నారు. వెళ్లడానికి ఓపిక లేదు అయినా లడక్ వెళ్ళారు.

అలాగే రామాయణంలో జటాయువు బ్రతికున్నంత సేపు దశరథ మహారాజుకి ఎంతో సహకారం అందించింది. చనిపోయేటప్పుడు కూడా రామ

లక్ష్మణులకు సీతను అటు వైపు తీసుకు వెళ్లాడు అని చెప్పి చనిపోయింది అలా సాత్విక గుణంలో వున్నవారు ప్రాణం పోయేటప్పుడు కూడా ఏదో ఉప కారం చేస్తారు. ఒకవేళ ఏమీ చేయలేకపోయినా అటువంటి కార్యక్రమాలు జరుగుతూ ఉంటే అవి విని చాలా సంతోషిస్తారు.

**దుర్జనులు:-** దుష్ట కార్యాలు చేసేవాడు బ్రతికున్నంత కాలం చెడే చేస్తాడు. చని పోయేటప్పుడు కూడా చెడు చేస్తూనే చస్తాడు. విశ్వామిత్రుడు లోకకళ్యాణం కోసం యజ్ఞం తలపెట్టాడు. అంత మంచి కార్యం చేస్తుంటే రాక్షసులు మారీచ, శూభాహులు దాన్ని పాడు చేయడానికే చూశారు.

మారీచుడు అన్నవాడు ప్రాణం పోయేటప్పుడు కూడా అపకారం చేశాడు. బంగారు లేడీ వేషం వేసుకుని వెడితే రాముడు బాణం వేసి కొడితే క్రింద పడిపోతూ హా లక్ష్మణా! హా సీతా! అని అరుస్తూ చచ్చాడు.

రాముడికి ఏమైపోయిందో అని చెప్పి సీతాదేవి తనకి కాపలా ఉన్న లక్ష్మణుడిని పంపించింది. తీరా చూస్తే అక్కడ చనిపోయింది రాముడు కాదు, వీడు. ఈ లోపులో రావణాసురుడు వచ్చి సీతాదేవిని తీసుకువెళ్లిపోయాడు. ఇలా ఉంటాయి దుష్ట లక్షణాలు కలిగిన వారి పనులు. బ్రతికున్నప్పుడు ఎవరికి మంచి చేయరు, చచ్చేటప్పుడు కూడా ఎవరికి మంచి చేయరు.

ఈ దుష్ట లక్షణాలు ఉన్నవారికి ఎవరైనా మంచి పనులు చేస్తూ వుంటే బాధ కలుగుతుంది, సంతోషించరు, కానీ బాధపడతారు. ఇంకా దుష్ట లక్షణాలు ఉన్న కొంతమంది మంచి చెయ్యక పోగా చెడ గొట్టే ప్రయత్నం చేస్తారు.

ఆ రకంగా గుణాలు మార్చుకోవడానికి మన సాధకులు రాత్రి అంతా సాధన చేశారు అంటే నాకు చాలా సంతోషం అయింది. మీరు మనసును శుద్ధి చేసుకోండి, ఆ శుద్ధ బుద్ధే మిమ్మల్ని నడిపిస్తుంది.

మనసు ఎంత శుద్ధి అయితే బుద్ధి అంత బాగా వికసిస్తుంది. బుద్ధి ఎంత బాగా ఉంటే వారి పనులు అంత పవిత్రంగా, శుద్ధంగా ఉంటాయి. అంతకన్నా ఏమీ లేదండి. మంచివారుగా మారడానికి, చెడ్డ వాడిగా ఉండడానికి, మనసే కారణం, గుణమే ప్రధానం.

దాన్ని మార్చే మార్గమే పత్రి గారు చెప్పిన, బుద్ధుడు చెప్పిన 'శ్వాస మీద ధ్యాస' ధ్యానం.

మహాత్ములు చెప్పిన ఇంకొక విషయం తెలుసుకుందాం.

**"ఏ మానవుడు అయినా సరే తమ చేతులతో ధర్మంగా సంపాదించి, తాము తిని అందులో నుండి కొంత ఇతరులకు పంచి పెట్టాలి, అలాంటి వారే భగవంతుని పొందగలరు".**

భగవంతుని పొందడం అంటే భగవంతుని పొందే మార్గము తెలుసు కోవడం. అంతా తెలుసుకుని ఆచరిస్తే చివరకు ఆ భగవంతుడినే పొంద గలుగుతారు. సమస్త దుఃఖాల నుంచి బయటపడతారు. చివరకు మోక్షం కూడా పొందగలుగుతారు. అంటే జన్మ రాహిత్య స్థితిని పొందుతారు, అంటే భూమి మీదకు ఇక రారు. భూమ్మీదకు రాకపోతే ఇంక దుఃఖం ఎక్కడ వుంటుంది? అంటే శాశ్వతంగా దుఃఖం నుండి బయటపడతారు. ఏ మానవుడైనా కోరుకోవలసినది, ప్రయత్నించవలసింది ఇదే.

భగవంతుని మార్గం పొందాలంటే తాను కష్టపడి సంపాదించి తాను తిని ఇతరులకు పంచాలి. ఇదే మహాత్ములు ఇచ్చిన సందేశం. ఈ మార్గంలో పయనించేటప్పుడు ఏదైనా సాధించాలంటే ఎవరికైనా శరీరం అవసరం. అలాగే శరీరానికి కొన్ని అవసరాలు వున్నాయి. అవి కూడు అంటే తిండి, గూడు అంటే ఇల్లు, గుడ్డ అంటే బట్టలు, తోడు అంటే భర్తకు భార్య, భార్యకు భర్త.

అవసరాలు తీరాలి అంటే ఎవరైనా ధనం సంపాదించాలి. ధనం సంపాదించకుండా శారీరక అవసరాలు తీరవు. డబ్బు అవసరాలకు సరిపడా వుండాలి. గుర్తుంచుకోవలసిన విషయం అవసరాలు వేరు, కోరికలు వేరు. కోరికలకు బానిస అయితే కోట్లు సంపాదించినా సరిపోదు. చూడండి గొప్పల కోసం చేసే ఫంక్షన్స్‌లో ఆహారం ఎంత వృధా చేస్తారో!

పత్రిగారు మానవునకు ఒక రొట్టె, నిమ్మకాయ తొక్కు సరిపోదా? అంటారు.

అందుచేత మహాత్ములు అవసరాలకు సరిపడా సంపాదించమంటారు. సంపాదన కోసం మనం తప్పులు చేయనక్కర్లేదు, అధర్మంగా సంపాదించ

వలసిన పని లేదు. పాపాలు చేస్తూ సృష్టి విరుద్ధంగా జీవించనక్కర్లేదు. అందుచేత తెలుసుకోండి కోరికలు తీర్చుకోవడం కోసం సంపాదించాలి అంటే పాపాలు చేయవలసిందే. దాని ఫలితంగా కోట్లు వుంటాయి కానీ కష్టాలతో, అంతులేని రోగాలతో  బాధపడతారు. ఎప్పుడు చనిపోతారో తెలియదు, అసలు అది జీవితమే కాదు.

అందుచేత తాను సంపాదించుకొన్న దానిలో తాను తిని, కొంత ఇతరులకు పంచి పెట్టాలి, అప్పుడు వారికి శరీరం సహకరిస్తుంది, సమస్యలుండవు, కష్టాలుండవు, రోగాలుండవు. అటువంటి శరీరంతో భగవంతుని పొందే ప్రయత్నం చేస్తారు. ప్రస్తుతం మనమంతా భగవంతుని పొందే ప్రయత్నం చేస్తున్నాము, కోట్లు సంపాదించాలని అనుకోవటం లేదు, అందరిలో గొప్పగా అనిపించుకోవాలని లేదు. మన అందరి ఆశయం భగవంతుని పొందడం. అందుచేత వున్న దాంట్లో కొంత పంచినప్పుడే భగవంతుని పొందే మార్గాన్ని పొందుతామని తెలుసుకోవాలి. అందుకే మనం భగవంతుని గురించి, భగవంతుని పొందే మార్గం గురించి తెలుసుకున్నాము. ముఖ్యంగా

1) భగవంతుడు ఎవరు?, 2) ఆయన ఎక్కడుంటాడు ?, 3) ఆయన ఏం చేస్తుంటాడు?, 4) భగవంతుని ఆశ్రయించాలి అంటే ఏమి చేయాలి? అన్నవి తెలుసుకున్నాము.

ఇవన్నీ ఎవరికి తెలుస్తాయి అంటే? మహాత్ములు చెప్పినట్లు తాను సంపాదించి తాను తిని ఇతరులకు పంచి పెట్టినప్పుడే సాధ్యమవుతాయి. అంతేకాదు భగవంతుని పొందే మార్గం “శ్వాస మీద ధ్యాస” అని తెలుసు కున్నాము.

పత్రి గారి మార్గంలో లేని వారందరికీ భగవంతుడు ఆత్మ అని తెలియదు. వారు భగవంతుడు గుళ్లో వుంటాడు అని అనుకుంటారు, కానీ సర్వ జీవులలో వుంటాడని తెలియదు.

భగవంతుడు ఏమి చేస్తుంటాడు అంటే? కొబ్బరికాయలు తీసుకుని కోరిన కోరికలు తీరుస్తాడు అని అనుకుంటారు. కానీ ఆయన అంతరాత్మ

రూపంలో మనం చేసే తప్పులు, పాపాలు ముందుగానే హెచ్చరిస్తూ వుంటాడని తెలియదు.

భగవంతుని ఎలా ఆరాధించాలి అంటే? పసుపు, కుంకుమ, అక్షింతలు, కర్పూరం, అగరవత్తులతో పూజించాలని అనుకుంటారు. కానీ ధ్యానం ద్వారా ఆరాధించాలని తెలియదు.

కానీ సత్యమైన భగవంతుడు గురించి భగవద్గీతలో శ్రీ కృష్ణ భగవానులు వారు చెప్పారు.

**శ్లో॥ అహ మాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః ।**
**అహమాదిశ్చ మధ్యం చ భూతానా మస్త ఏవ చ ॥ (భ.గీ.10-20)**

తా:- "ఓ అర్జునా, నేను ఆత్మను", అన్ని జీవులలో స్థితమై వున్నాను. సృష్టి జరగకముందు వున్నాను, సృష్టి జరుగుతున్నప్పుడు వున్నాను, సృష్టి అంతం అయినా నేను వుంటాను అని చెప్పారు.

అంటే నేను ఆత్మను అని చెప్పారు శ్రీ కృష్ణభగవానులు.

ఆయన నేను అన్ని ప్రాణులలో ఆత్మ రూపంలో వున్నాను అన్నారు. మరి ఆత్మ కనిపిస్తుందా? అంటే కనిపించదు. భగవంతుడు శక్తిగా వున్నాడు.

భగవంతుని రూపమే శక్తి, చైతన్యం. ఆనందము, అపారమైన జ్ఞానమే ఆయన స్వరూపం. ఆయన అందరి శరీరాలలో ఆత్మగా వుండి సృష్టి ధర్మాలు, నియమాలు బోధిస్తుంటాడు.

ధర్మ విరుద్ధమైన పనులు చేస్తున్నప్పుడు హెచ్చరిస్తాడు. అధర్మంగా ప్రవర్తిస్తే నష్టపోతావు, కష్టాలపాలవుతావు అని ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే వుంటాడు. ఆయన అనుక్షణం మన ధర్మాలను గుర్తు చేస్తుంటాడు. దానినే అంతరాత్మ ప్రబోధం అంటారు.

అందుచేత భగవంతుని నుండి అందేదే ధర్మం అని తెలుసుకోండి. చాలా మందికి ఇది అర్థం కాదు, భగవంతుడు మన ధర్మాలు అంతరాత్మ రూపంలో చెపుతున్నాడని తెలియదు. తెలియకపోవడానికి కారణం మలినంగా వున్న మనస్సే.

కానీ ధ్యానం ద్వారా మనస్సు శుద్ధి చేసుకున్న వాడు భగవంతుడు

బోధించే ధర్మాన్ని తెలుసుకోగలుగుతాడు.

మనమంతా భగవంతుని పొందే మార్గం తెలుసుకున్నాము, భగవంతుని పొందే అర్హత మనకు వుంది కాబట్టే పత్రిగారిని అనుసరించగలిగాము.

ఈ ధ్యాన మార్గంలోకి రావడం, తీవ్రంగా ధ్యానం చేసే అవకాశం లభించడం ఏ జన్మలోనో చేసుకున్న పుణ్యం వల్లనే సాధ్యమైంది.

సహజంగా ఎవరైనా భూమ్మీదకు వచ్చే ముందు ధ్యానం చేయాలి, జ్ఞానం సంపాదించాలి అని నిర్ణయించుకుని వస్తారు. పై లోకాల నుండి భూమ్మీదకు వచ్చే ముందు ఎలా జీవించాలి? ఏమి సాధించాలి? అని ప్రణాళిక వేసుకుని వస్తారు, కానీ వచ్చిన తరువాత అన్నీ మరిచిపోతారు.

కారణం ఏ మతంలో జన్మిస్తారో ఆ మత ప్రభావం వారిపై వుంటుంది, ఏ కులంలో జన్మిస్తారో ఆ కుల ప్రభావం కూడా వారిపై వుంటుంది, ఏ కుటుంబంలో జన్మిస్తారో ఆ కుటుంబ ప్రభావం కూడా వారిపై వుంటుంది. అందుచేత వీటన్నిటి ప్రభావం వల్ల ఎవరైనా నిర్ణయించుకొన్నది ఒక్కటి, చేస్తున్నది ఇంకొకటి అవుతుంది. కానీ ప్రకృతికి విరుద్ధంగా, భిన్నంగా వ్యవహరిస్తుంటే ప్రకృతి ఒప్పుకోదు.

ఏదో ఒక రూపంలో భగవంతుని వైపు నడిపిస్తుంది. అలా మనలో చాలా మందికి పాంప్లెట్ల ద్వారా, స్నేహితుల ద్వారా, బంధువుల ద్వారా ఈ ధ్యాన మార్గం పరిచయం అయింది. అలాగే కొంతమంది రోగాలతో వస్తారు, కొంతమంది అశాంతితో వస్తారు, కొంతమంది సమస్యలతో వస్తారు. ఈ మార్గంలోనికి వచ్చి ఈ పని చేస్తున్న కొద్దీ అన్నీ అనుకూలిస్తాయి, జీవితం సాఫీగా, ప్రశాంతంగా వుంటుంది.

నేను వ్యాపారంలో 30 ఏళ్లు గడిపాను, రకరకాల వ్యాపారాలు చేసాను. కానీ నేను చేయవలసింది అందరికీ జ్ఞానం అందించడం, కానీ అది చేయకుండా వేరే చేస్తుంటే నాకు ఒక్కసారిగా అన్నీ రివర్స్ అయ్యాయి. ఆ సమయంలో పత్రి గారి పరిచయం అయ్యింది.

పత్రిగారు చెప్పిన వాటితో ఆయన పట్ల ఆకర్షితుడనై అన్నింటిని వదిలి ఈ మార్గాన్ని చేపట్టాను. ధ్యానం చేస్తూ, జ్ఞానం సంపాదించి అందరికీ పంచి

పెట్టడంతో మళ్ళీ కుటుంబంలోని వారి సహకారం అందింది. మేడమ్ సహకారంతో 2004 నుండి కంటిన్యూగా ఇంత వరకు ఆత్మజ్ఞానం శిక్షణా శిబిరంలో క్లాసులు నిర్వహిస్తున్నాము. ఎంతోమందికి జ్ఞానం అందించగలుగు తున్నాము.

ప్రపంచంలో ఎన్నో లక్షల మంది ధ్యానం చెయ్యకుండా వున్నారు. ఈ మార్గంలోకి వచ్చిన మీరు మాత్రం తీవ్ర సాధన చేస్తూ, జ్ఞానం పొందడమే కాదు, పొందిన జ్ఞానం పంచుతున్నారు. అలా చేస్తున్నప్పుడు అన్నీ సాఫీగా సాగుతాయి, అన్నీ కలిసి వస్తాయి. కానీ చేయకూడని పనులు చేస్తుంటే ఏవీ కలిసి రావు.

కానీ మన ప్రణాళికకు అనుగుణంగా జీవిస్తే ఎటువంటి ఇబ్బందులు వుండవు, అన్నీ అనుకూలిస్తాయి. అందుచేత ప్రక్కవారితో పోల్చుకోవలసిన పని లేదు. ప్రక్కవారి ప్రవర్తనతో పోల్చుకుంటే మన ప్రవర్తన భిన్నంగా వుంటుంది, మనం చదివే పుస్తకాలు, వీడియోల ద్వారా వినే సందేశాలు కూడా ప్రక్కవారికి భిన్నంగా వుంటాయి. అంతేకాదు మన జీవితంలో ముందు వున్న ప్రవర్తన కానీ, మాటలు కానీ, చేతలు కానీ ఇప్పటి జీవితానికి చాలా భిన్నంగా వుంటాయి.

మీకు పిచ్చి పట్టిందా? అని ఎవరైనా మిమ్మల్ని అంటే మీరు ఆధ్యాత్మికంగా ఎదిగినట్లు. గమనిస్తే లోకంలోని వారు ఒక రకంగా జీవిస్తుంటారు, కానీ ఈ మార్గంలోకి వచ్చినవారు ఇంకొక రకంగా జీవిస్తుంటారు.

కానీ ఆత్మకు భిన్నంగా ప్రవర్తిస్తే క్షోభ మొదలవుతుంది. మనం చేయవలసింది చేయకుండా వేరే చేయటం వల్ల ఆత్మ క్షోభిస్తుంది, దానినే 'ఆత్మ ఘోష' అంటారు, అప్పుడు మనకు కష్టాలు మొదలవుతాయి.

పత్రి గారు భగవంతుని చేరేందుకు చెప్పిన మార్గమే 'శ్వాస మీద ధ్యాస' ధ్యానం. మనం సమస్యలు అనుకుంటాము కానీ అవి సమస్యలు కాదు, మనం చేయవలసినవి చేయకపోతే సమస్యలు అలాగే వుంటాయి. చెయ్యవలసినవి చేస్తే సమస్యలు వుండవు.

మహాత్ములు ఇంకా ఏమన్నారంటే ? **"భగవంతుని ఆశ్రయించాలంటే ఏ జీవికి బాధ కలిగించకూడదు. జీవహింస చేయకూడదు, ఏ జీవికి హాని తలపెట్టకూడదు"**

ఋషులు, మహర్షులు అడవుల్లోనే వుంటారు. ఎంతటి క్రూరమృగం కూడా వారికి హాని చేయదు. కారణం వారు ఏ జీవికి హాని చేయరు, పైగా వాటితో స్నేహ భావంతో జీవిస్తారు.

స్వామి రామా గారు తేనె పట్టు వున్న చెట్టు ఎక్కి పండ్లు కోసుకుని క్రిందకు దిగారు. అంటే తేనెటీగలు ఆయనను ఏమీ చేయలేదు అని తెలుసుకోవాలి.

అంటే మనం ఏ జీవి జోలికి వెళ్లకపోతే, ఏ జీవి మన జోలికి రాదు. ఆ మహానుభావులు, గొప్పవారు ప్రతి జీవి భగవత్ స్వరూపమే! ఏ జీవిని హింసించినా భగవంతుని హింసించినట్లే అని తెలుసుకున్నారు.

అందుచేత జీవిని బాధిస్తే భగవంతుని బాధించినట్లే! భగవంతుని హింసించిన వాడు, భగవంతుని పొందే మార్గాన్ని ఎలా పొందుతారు? మార్గమే పొందకపోతే భగవంతుని ఎలా పొందుతారు? భగవంతుని పొందితేనే కదా? దుఃఖం నుండి బయటపడేది!

ఏ జీవిని అయినా కోస్తున్నప్పుడు కోసుకోమని చెప్పదు. అందుచేత ఇంటికి వచ్చిన బంధువులను, ఫ్రెండ్స్‌ను సంతోష పెట్టడానికి మాంసాహారం పెట్టకూడదు.

చాలా మంది గత జన్మలో భగవంతుని పొందే అర్హత సంపాదించారు. కానీ జన్మ తీసుకున్నాక కుటుంబ ప్రభావం వల్ల, సమాజ ప్రభావం వల్ల, చేయకూడని పని చేస్తున్నారు. మానవులు జంతువులను, పక్షులను తినడానికి భూమి మీదకు రాలేదు, కానీ వారి తల్లిదండ్రులు మాంసాహారం అలవాటు చేసారు. కానీ ధ్యానమార్గంలోకి వచ్చిన వెంటనే తెలుసుకుని మానేస్తారు. అలాగే సాధన చేయడానికి ఆసక్తి చూపిస్తారు.

ధ్యానంలోకి రావాలి అంటే పూర్వ జన్మ సుకృతం వుండాలి. అంటే గత జన్మలోనే పుణ్యం చేసుకుని అర్హత సంపాదించుకుని వుండాలి. కానీ పరిస్థితుల ప్రభావం వల్ల అలా వున్నారు. అందుకే పత్రి గారు ఊరూరు తిరిగి ధ్యానం చెప్పారు. రాష్ట్రాలే కాదు దేశ దేశాలకు వెళ్లారు. "శ్వాస మీద ధ్యాస ధ్యానం" చెప్పారు. కానీ కొంతమంది ధ్యానం చేస్తే లాభాలు వస్తాయని, అనుభవాలు పొందవచ్చని, రోగాలు పోగొట్టుకోవచ్చని, కోరికలు నేరవేరతాయని ధ్యానం లోకి వస్తారు.

ఇలా రకరకాల లాభాలను ఆశించి ధ్యానం చేస్తున్నారు. కానీ అర్హత లేకపోవడం వల్ల ధ్యానంలోకి వచ్చినా ధ్యానం చేయలేకపోతున్నారు. పత్రిగారు ధ్యానమంటే 'శ్వాస మీద ధ్యాస' అని చెప్పారు. కానీ చాలా మందికి ధ్యానమంటే ఏమిటో అర్థం కాక "మాట మీద ధ్యాస" అని, "మ్యూజిక్‌పై ధ్యాస" అని చేస్తున్నారు.

కానీ పత్రిగారు చెప్పింది 'శ్వాస మీద ధ్యాస'. ధ్యానంలో ఆలోచనలు లేని స్థితిలో, మనస్సు పని చేయని స్థితిలోనే శక్తి వస్తుంది.

పత్రిగారు మ్యూజిక్ మెడిటేషన్ ఎందుకు చేయిస్తున్నారు? అంటే క్రొత్త వారికి అలవాటు కావడానికి. అందుకే గొప్పవారు "చెప్పింది చెయ్యాలి. కానీ చేసింది చేయకూడదు" అని తెలుసుకోవాలి.

ఆలోచనల నుంచి తేలికగా బయటపడే తేలికైన, సులువైన మార్గం 'శ్వాస మీద ధ్యాస'. ధ్యానంలో గంటలు, గంటలు కూర్చోగలగాలి అంటే మనస్సులోని ఆలోచనలు ఖాళీ చేయాలి, ఆలోచనలు వస్తే కూర్చోలేరు. మనసులో వున్న చెత్త ఆలోచనలు ఖాళీ చేసుకునే మార్గం 'శ్వాస మీద ధ్యాస'.

ఈ మార్గం తప్ప ఇంకేమి చేసినా ఆలోచనలు పెరుగుతాయే కానీ తగ్గవు. అసలు రోజు రోజుకు ఆలోచనలు ఎలా పెరుగుతాయి అంటే?

ఉదా:- (1) చూడండి పక్కింట్లో భార్యభర్తలు గొడవలు పడుతున్నారని వాళ్ళింటికి వెళతారు. అక్కడ భార్య ఒక విధంగా చెబుతుంది, భర్త ఒక విధంగా చెబుతాడు, వీళ్ళకు బుర్ర తిరిగిపోతుంది. వీరు ధ్యానంలో కూర్చోగానే అవే గుర్తుకు వస్తాయి. అక్కడకు వెళ్లకపోతే అలాంటి ఏ ఆలోచనలు రావు కదా?

(2) చూడండి కొంతమంది 3 రోజులు క్లాస్‌కి వచ్చి ఇంటికి ఫోన్ చేసి అక్కడ విషయాలు వింటారు! వారు మళ్ళీ ధ్యానంలో కూర్చోగానే ఆ విషయాలే ఆలోచనలుగా వస్తాయి.

(3) ఎలక్షన్స్‌లో ఓడిపోతే ఆ ఆలోచనల నుంచి బయటపడాలంటే సంవత్సరాలు పడుతుంది. ఏ విషయాలు అయినా లోపలికి వెళ్ళడం తేలిక. కానీ బయటకు రావడం చాలా కష్టం.

గుర్తుంచుకోండి లోకులకు మంచి చేస్తే లోకేశుడు మనకు మంచి చేస్తాడు. ఏమీ చేయకుండా నేను బాగుండాలి అంటే ఎప్పటికి బాగుండము. ఇతరుల బాగు చూసినప్పుడే, భగవంతుడు మన బాగు చూస్తాడు.

వీలైనంత వరకు ఎవరి స్థాయికి తగ్గట్టు వారు ధ్యానం చేయాలి. **"మన వల్ల ఇతరులకు నష్టం కానీ, బాధ కానీ, కలగకుండా జీవించాలి, ఇదే మహాత్ములు ఇచ్చిన సందేశం"**

'శ్వాస మీద ధ్యాస' పెట్టినప్పుడు ఆలోచనలు తగ్గుతూ వస్తాయి.

ఆలోచనలు ఖాళీ అయితేనే ధ్యానంలో గంటలు, గంటలు కూర్చోగలరు, ఎన్నో లాభాలు పొందగలరు. ధ్యానము సామాన్యమైనది కాదు, ధ్యానాన్ని లాభాల కోసం కాకుండా జ్ఞానం కోసం చేస్తే ఎంతో గొప్పవారు అవుతారు.

**మనందరికీ భగవంతుని చేరుకునే మార్గము అంటే ధ్యానం అందింది, అంటే మనకు అర్హత వున్నట్లే. అర్హత వుంటేనే ఈ మార్గంలోకి వస్తారు. ఒక్క విషయం గుర్తుంచుకోండి! "గొప్ప వాళ్ళు చెప్పింది చెయ్యాలి, కానీ వారు చేసింది చెయ్యకూడదు".**

ప్రపంచంలోని వారిని గమనిస్తే ఎన్నో సమస్యలతో సతమత మవుతున్నారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క రకమైన సమస్య. సమస్య అన్నది చాలా బాధాకరం, తట్టుకోవడం కష్టం. ఆ సమస్యలతో బాధపడుతున్న వారికి శాంతి వుండదు, ఏ పని హుషారుగా చేయలేరు, ఎందుకు వచ్చిన బ్రతుకురా అనిపిస్తుంది. సమస్య ఎందుకు వచ్చిందో తెలియక, నాకే ఎందుకు వచ్చింది? అని బాధపడుతుంటారు. ఏమి చెయ్యలేక భగవంతునిపై నింద వేస్తారు. భగవంతుడు నన్ను కష్టపెడుతున్నాడు అని అనుకుంటారు. అలా ఎవరిని

చూసినా సమస్యలతో వున్నారు.

పత్రిగారు **"ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్త" అన్నారు. అంటే నా కష్టాలను నేనే సృష్టించుకున్నాను, అంటే నేనే కారణం** అని తెలుసుకోవాలి.

చాలా మంది మాంసం తినకపోతే బలం ఎలా వస్తుంది? అంటారు. కానీ మాంసాహారం హింస చేస్తేనే వస్తుంది. అంతేకాదు ఎలాంటి హింస చేస్తే అలాంటి హింస అనుభవిస్తారు, చేసిందే అనుభవిస్తారు. గమనిస్తే చేయడం తేలిక, అనుభవించడం కష్టం. చూడండి కోడి పీక కోస్తారు, కొన్నాళ్ళకు స్పాండిలైటిస్ వ్యాధితో వారి గొంతుకు బ్యాండేజ్ వేసుకుంటారు. అంటే చేసిందే అనుభవిస్తున్నారు, చేయకపోతే అనుభవించరు కదా?

అందుచేత ఇక నుండి అయినా జీవితం మార్చుకోవడం అలవాటు చేసుకోవాలి. ధ్యానం చేసి రోగం తగ్గించుకోవడం ముఖ్యం కాదు. ధ్యానం చేసి జ్ఞానం సంపాదించుకోవాలి అన్నదే ముఖ్యం.

**(1) జ్ఞానము అంటే మన కంటికి కనిపించని వాటి గురించి తెలుసుకోవడమే.**

**(2) జ్ఞానం అంటే నేను దేహం కాదు, నేను ఆత్మను అని తెలుసుకోవడం అని పత్రిగారు చెప్పారు.**

సృష్టిలో కంటికి కనిపించేది గోరంత అయితే, కనిపించనిది మేరు పర్వతమంత వుంటుంది. ఈ జీవితమే కాకుండా కంటికి కనిపించని జీవితం కూడా చాలా వుంది.

దేహంలో వున్నప్పుడు కంటికి కనిపించే జీవితాన్ని జీవిస్తారు. చనిపోయాక దేహాన్ని కాల్చివేస్తారు. కానీ ఆత్మ అయిన నువ్వు వుంటావు, ఆ జీవితం కనిపించదు కానీ అలా కంటికి కనిపించని జీవితం ఉందని తెలుసుకోవడమే జ్ఞానం.

కనిపించని జీవితం గురించి బ్రతికి వున్నప్పుడు తెలియదు. కంటికి కనపడని వారంతా కంటికి కనిపించని లోకాలలో వుంటారు.

**సూక్ష్మ లోకాలు కనపడవు, లోకాలలో వున్నవారు కనపడరు, అలా కంటికి కనపడని వాటి గురించి తెలుసుకున్న వాడే జ్ఞాని.**

సృష్టిలో కనిపించని లోకాలు వున్నాయి. ఏడు ఊర్ధ్వలోకాలు, ఏడు అథోలోకాలు.

సృష్టిలో కనిపించే లోకాలు నీటి బొట్టంత అయితే, కనిపించని లోకాలు సముద్రమంత వున్నాయి.

కనిపించే లోకాలు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, నవగ్రహాలు, ఇంకా తెలియనివి ఎన్నో లోకాలు వున్నాయి. లక్షల భూ మండలాలున్నాయని పత్రిగారు చెప్పారు. అందులో ఏది గొప్పది అని అడిగితే దేని గొప్పతనం దానిదే, దేని విశిష్ఠత దానిదే అన్నారు. అలా ఎన్నో సూర్యులు, ఎన్నో చంద్రులు వున్నారు. జ్ఞానం పెరిగితే సృష్టి యొక్క గొప్పతనం అర్థమవుతుంది, ఆశ్చర్యం వేస్తుంది.

సృష్టి గొప్పతనం గురించి నా చిన్నవయస్సులో ఒక పండితుల వారు చెప్పిన పురాణ కథ తెలుసుకుందాం.

సృష్టిలో అందరికంటే గొప్పవాడు పరబ్రహ్మ, ఆయననే సృష్టికర్త అంటారు. ఆయనచే సృష్టింపబడిన బ్రహ్మ, విష్ణు మహేశ్వరులలో కొంత అహంకారం ప్రవేశించిందట.

ఈ సృష్టి చేస్తున్నది మేమే, నడిపిస్తున్నది మేమే, లయం చేసేది మేమే అనే అహంకారం చోటు చేసుకుందట. పరబ్రహ్మ వారికి బుద్ధి చెప్పాలనుకుని వారిని నాతో రమ్మని వారు ముగ్గురిని కళ్ళు మూసుకోమని కోటానుకోట్లు మైళ్ళు వీరిని తీసుకు వెళ్ళాడట.

ఒకచోట పరబ్రహ్మ వారిని కళ్ళు తెరవమన్నారు. వారు కళ్ళు తెరిచి చూసేరికి అక్కడ బ్రహ్మ, సరస్వతి వున్నారట. అప్పుడు బ్రహ్మ ఆశ్చర్యపోయాడట. ఇంకొక బ్రహ్మ కూడా వున్నాడా? అని. అప్పటి వరకు నేనే బ్రహ్మను సృష్టి చేసేది నేనే అని అనుకున్నాడట. ఇప్పుడు ఇంకొక బ్రహ్మ కనిపించే సరికి ఆయన ఆశ్చర్య పోవడమే కాదు, ఆయనలోని అహంకారం దిగిపోయిందట.

తరువాత పరబ్రహ్మ వారిని మరల కళ్ళు మూసుకోమని చెప్పి కోటాను కోట్ల మైళ్ళు ప్రయాణించిన తరువాత మరల కళ్ళు తెరవమని చెప్పారట. ఆశ్చర్యం అక్కడ ఇంకో వైకుంఠం వుండటమే కాదు, అక్కడ విష్ణువు, లక్ష్మీదేవి

కూడా వున్నారట. వారి ఆశర్యర్యానికి అంతులేదట. మరల కళ్లు మూసుకోమని ఇంకా కొన్ని కోట్ల మైళ్ళు ప్రయాణించిన తరువాత మరల కళ్ళు తెరవమని పరబ్రహ్మ చెప్పగానే వారు కళ్ళు తెరిచారట. మరల ఆశ్చర్యం. అక్కడ మరొక కైలాసం వుండటమే కాదు, అక్కడ శివుడు, పార్వతి కూడా వున్నారట.

అప్పుడు పరబ్రహ్మ వారితో మీరే సమస్తము అని విర్రవీగుతున్నారు. కానీ ఈ సృష్టిలో మీలాంటి వారు ఎంతోమంది వున్నారు అని చెప్పారట.

అందుచేత సృష్టి అనంతమైనది, ఆది అంతము లేనిది అని తెలుసు కోవాలి. అందుచేత ఇంకా తెలుసుకోవలసింది ఏమిటంటే సృష్టి చేసిన సృష్టికర్త వున్నాడు, కనిపించడు. అంతేకాదు సృష్టికర్త చేసిన ధర్మాలున్నాయి, ఆయన ఏర్పాటు చేసిన సిద్ధాంతాలున్నాయి అని తెలుసుకోవాలి. వాటినే సృష్టికర్త చేసిన రాజ్యాంగం అని కూడా చెప్పుకోవచ్చు కానీ కనిపించవు కానీ వాటి గురించి తెలుసుకోవడమే జ్ఞానం.

ఏది ఏమైనా మానవుడు చేసే హింస వల్లే కష్టాలు వస్తాయి. కష్టాలు రాకూడదు అంటే హింస చేయకుండా అహింసా మార్గంలో పయనించాలి.


**YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు**

**a) Channel Name : Tatavarthy Veera Raghava Rao.** ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

**b)** అలాగే **PMC** వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క **YouTube Channel** ప్రారంభించారు. **Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao**

**c)** తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు **Tatavarty Spiritual Trainees** ఛానెల్‌లో చూడండి.

**d) Direct** గా **YouTube app** లోకి వెళ్ళి **search bar** లో **Tatavarthy Veera Raghava Rao** అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

మహాత్ములు ఏమన్నారంటే? **"ఎవ్వరి నుండి ఏది ఆశించ కూడదు, అందరికీ సేవ చేయాలి, సహకారం అందించాలి"** అన్నారు.

ఆశ అన్నది పెనుభూతం, ఎవరినైనా మింగేస్తుంది. అందుకే షిరిడి బాబా ఈశావాశ్యోపనిషత్‌లో ఇలా చెప్పడం జరిగింది.

**శ్లో॥ ఈశా వాశ్య మిధం సత్యం, యత్కించ జగిత్యాం జగత్**
**తేన త్యక్తేన భుంజిధాం మాగృథం కశ్యసిద్ధినం**

తా:- ఈ సృష్టి మొత్తం జడ చైతన్యం అంటే కదలిక కలిగిన, కదలిక లేని రూపాలన్నీ ఆ పరబ్రహ్మచే వ్యాపించబడ్డాయి. కాబట్టి ఏది వున్నా, ఏది లభించినా అది ఈశ్వరునిదే అని తెలుసుకోవాలి. అందుచేత ఈశ్వరుని నుండి లభించిన ఐశ్వర్యాన్ని త్యాగపూర్వకంగా అనుభవించాలి. ఏ రకమైన లోభాన్ని, మోహాన్ని పెట్టు కోకూడదు, ఎవ్వరిది ఆశించకూడదు, అపహరించకూడదు అని షిరిడి బాబా చెప్పారు.

గొప్పగొప్ప మహా యోగులు ఇదే బోధించారు. విరుద్ధంగా ప్రవర్తిస్తే జీవితంలో విరుద్ధ ఫలితాలుంటాయి. లోకంలో నాది నాది అంటారు, అసలు నాది అన్నది ఎక్కడుంది? నాది అన్నది ఏదీ లేదు, అంతా ఆయనదే! ఆ పరబ్రహ్మదే! అందరూ కొన్ని అనుభవాల కోసం, పాఠాలు నేర్చుకోవడానికే ఈ భూమ్మీదకు వచ్చారు. అందుచేత అంతకు ముందు మీరు పొందిన అర్హతను బట్టే పొందవలసింది పొందుతారు.

అందుకే కొంతమంది దగ్గర లక్షలు, కోట్లు వున్నాయి. కొంతమంది దగ్గర వేలున్నాయి, కొంతమంది దగ్గర ఏమి లేదు.

ఏది ఏమైనా ఏది వున్నా లేకున్నా, ఏదీ మీది కాదు అని తెలుసుకోవాలి. భూమ్మీదకు వచ్చేటప్పుడు మీరు ఏమి తీసుకుని రాలేదు, ఏమీ తీసుకుని రాని మీరు ఎలా తీసుకువెళతారు? వెళ్ళవలసిన సమయం రాగానే అన్ని వదిలేసి వెళ్ళిపోతారు, మారు మాట్లాడకుండా వెళ్ళిపోతారు. నాది నాది అని అంటారు.

కానీ నాది అన్నది ఎక్కడ వుంది? మీరు పాఠాలు నేర్చుకోవడానికి, అనుభవాలు పొందడానికి మాత్రమే వచ్చారు.

చూడండి రైలు ప్రయాణంలో ఎవరి స్తోమతను బట్టి వారు బెర్త్‌లు రిజర్వు చేసుకుంటారు. ఫస్ట్ ఎ.సి., సెకండ్ ఎ.సి., స్లీపర్, జనరల్, అలా ఎవరి స్తోమతను బట్టి వారు బెర్త్ రిజర్వు చేసుకుంటారు. అలాగే భూమి మీద మీ అర్హతను బట్టి మీ ఆర్థిక స్థితి వుంది.

రైలు టిక్కెట్టు కొన్ని గంటలు ప్రయాణం కొరకు బుక్ చేసుకుంటూ ప్రయాణం చేసినంత సేపూ నాది, నాది అంటారు. ప్రయాణం అయిపోగానే దిగిపోతారు.

ఈ జ్ఞానం లేనివాడు నాది, నాది అని వెంపర్లాడుతాడు. తెలిసిన వాడు, తెలియని వాడిపై జాలి చూపిస్తాడు. చూడండి ట్రైన్ ప్రయాణంలో ఎంతోమంది పరిచయం అవుతూ వుంటారు. కానీ గమ్యం చేరగానే ఎవ్వరూ నీ వెంట రారు. అలాగే జీవిత ప్రయాణంలో కూడా ఎవ్వరు పర్మినెంట్ కాదు, కూడా రారు.

జీవిత ప్రయాణంలో భర్త, భార్య పరిచయం అవుతారు. ట్రైన్‌లో కొంతదూరం ప్రయాణించగానే తోటి వారు ఎలా దిగిపోతారో! జీవిత ప్రయాణంలో  భార్య, భర్త కూడా మధ్యలో దూరవుతారు. అందుచేత నాది, నాది అని ఆశపడడం ఎందుకు? పాపాలు, తప్పులు చేయడం ఎందుకు? అంతేకాదు ఎవరి కోసం  నేరాలు, ఘోరాలు చేసినా నువ్వు నిష్క్రమించినప్పుడు నువ్వు చేసిన తప్పులు, పాపాలు మాత్రం నీ వెంట వస్తాయి.

అందుచేత ఏది వున్నా! ఏది లభించినా! అది ఈశ్వరునిదే అని తెలుసుకో!

పుట్టగానే కొన్ని వుంటాయి. తరువాత కొన్ని అర్హతను బట్టి లభిస్తాయి. పదవులు, ఉద్యోగాలు, సంపదలు ఏవైనా అర్హతను బట్టి లభిస్తాయి. కానీ అలా భగవంతుని నుండి పొందిన దానిని త్యాగపూర్వకంగా అనుభవించాలి అని షిరిడీ బాబా అన్నారు.

దానికి "ధర్మంగా సంపాదించిన దానిలో కొంత మనం తిని, కొంత

ఇతరులకు పంచాలి". అదే త్యాగపూర్వకంగా అనుభవించడం అంటే! పత్రిగారు పరిచయం కానంత వరకు నాకు ఏమీ తెలియదు, పరిచయం అయిన తర్వాత చాలా తెలుసుకున్నాను.

అందుచేత నువ్వు భగవంతుని నుండి పొందిన దానిలో కొంత లోకకళ్యాణానికి ఉపయోగించు. లోక కళ్యాణం కోసం ఎంత ఖర్చు పెడతారో! అదే త్యాగపూర్వకంగా అనుభవించడం అంటే! ఇతరుల మంచి కోసం ఖర్చు పెట్టడంలో లోభం చూపించకు. ఇవ్వవలసింది ఇవ్వకపోతే పొందవలసింది పొందలేవు.

నాది ఇస్తున్నాను, నాది ఇస్తున్నాను అనుకుంటావు. కానీ ఇవ్వడానికి నీది అన్నది ఏదీ లేదు, అంతా ఈశ్వరునిదే. ఈశ్వరుని నుండి వచ్చినదే పంచుతున్నావు. పంచింది పెంచబడుతుంది అని పత్రిగారు చెప్పారు. మనది కానిది పంచలేకపోవడమే లోభం, పిసినారితనం అంటారు. కారణం పంచడం కష్టం, దాచుకోవడం ఇష్టం కాబట్టి. ఏదైనా అర్హత అన్నది ఇస్తే వస్తుంది, ఇవ్వకపోతే రాదు. ఇవన్నీ తెలిసే షిరిడీ బాబా భిక్షాటన చేసి బ్రతికేవారు.

కానీ అజ్ఞానులు బాబా నుండి ఐశ్వర్యం పొందవచ్చు అని హారతులు ఇస్తారు. మరి బాబా ఐశ్వర్యం ఇచ్చేటట్లయితే ఆయనే పెద్ద బంగళా కట్టుకుని హాయిగా వుండవచ్చు కదా? ఎందుకు భిక్షాటన చేసారు? అంటే ఐశ్వర్యంలో ఏమీ లేదనేగా? అందుచేత ఏమీ చేయని వాడికి ఏమీ రాదని తెలుసుకోండి. వున్న దాంట్లో పంచితే మరుజన్మలో పొందే అర్హతను పొందుతారు.

ఈ సృష్టిలో ఏది శాశ్వతం కాదు, సృష్టిలో మార్పు అన్నది సహజం. ఇప్పుడు చేసుకున్న దానిని బట్టే భవిష్యత్ జీవితం ఆధారపడి వుంటుంది, ఇవ్వకపోతే ఏదీ రాదని తెలుసుకోండి. అంతేకాదు మనది కాని దాన్ని చెప్పకుండా తీసుకున్నా అపహరించినట్లే! మనది కాని దాన్ని ఆశించకూడదు, తీసుకోకూడదు! వున్న దాంట్లో వీలైనంత పంచాలి, అందరికీ సేవ చేయాలి, సహకారం అందించాలి అప్పుడే త్యాగపూర్వకంగా జీవించినట్లు.

"అన్నింటికంటే గొప్పసేవ, అత్యుత్తమ సేవ జ్ఞానసేవ"

తెలుసుకోండి

ధనం అశాశ్వతం - జ్ఞానం శాశ్వతం

ధనం కూడా రాదు - జ్ఞానం కూడా వస్తుంది

ధనం దుఃఖాన్ని పెంచుతుంది - జ్ఞానం దుఃఖాన్ని తగ్గిస్తుంది

ధనం అన్నది ఇహంలో కొంతవరకే ఉపయోగపడుతుంది, కానీ జ్ఞానం ఇహపరాలలో లాభం చేకూర్చుతుంది. ఎంత ధనం వున్నా ఊర్ధ్వలోకాలు చేరుకోలేరు, కానీ జ్ఞానం వుంటే ఊర్ధ్వ లోకాలు చేరుకుంటారు.

ఇక్కడ ఎంత ధనం వున్నా వారు చేసే కర్మలను బట్టే వారు పొందే లోకాలు ఆధారపడి వుంటుంది. జ్ఞానమున్న వాడు ఊర్ధ్వ లోకాలు చేరుకోవడమే కాదు, అక్కడ గొప్ప గొప్ప జ్ఞానులు ఋషులు, మహర్షులు, యోగుల సాంగత్యాన్ని పొందుతారు.

ధనమున్న వాడికి కర్మలను బట్టే మరుజన్మ వుంటుంది. జ్ఞానమున్న వారికి వారు కోరుకున్నట్టు మరుజన్మ వస్తుంది. అందుచేత జ్ఞానం సంపాదిస్తే అన్నీ లాభాలే.


**తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము**

**website address : www.tst.org.in**

**a)** తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు **Google Maps Location** తెలుసుకోవచ్చు.

**b)** తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు **PDF** రూపంలో కలవు. వాటిని ఉచితంగా **Download** చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

**c)** తటవర్తి దంపతుల సందేశాలు **Concept** వారీగా **YouTube Play lists** రూపంలో ఇవ్వడం జరిగింది.

**d)** తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

**e)** తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

**5.** భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

మహాత్ములు ఇంకా ఏమన్నారంటే **“ఈ లోక వస్తువులపై వ్యామోహం మనల్ని పదే పదే ఈ అధోలోకానికి తీసుకువచ్చి చావు పుట్టుకల విష చక్రంలో బంధిస్తుంది”**

భూమిని అధోలోకం అని ఎందుకు అన్నారు? అంటే అధోలోకం పైన 6 సూక్ష్మలోకాలున్నాయి.

1) భువర్లోకం, 2) సువర్లోకం, 3) జనాలోకం, 4) మహాలోకం, 5)తపోలోకం, 6) సత్య లోకం

ఈ భూలోక వస్తువులపై వ్యామోహం వుండటం వల్ల ఈ అథోలోకానికి పదే పదే వస్తున్నాము. ఈ లోకంలో భర్త, భార్య, పిల్లలు, మనవళ్ళు, డబ్బు, సంపదలు, సుఖాలున్నాయి కోకొల్లలుగా వున్నాయి.

మానవుడు పంచ జ్ఞానేంద్రియాలతో అనుభవించే వాటిపై వ్యామోహం వల్ల తినే పదార్థాలు, కళ్ళతో చూడగలిగే సుందర దృశ్యాలు, చెవితో వినగలిగే సంగీతం, సువాసనలు, స్పర్శ సుఖం. వీటన్నింటితో అనుభవించడానికి ఆకర్షితులు అవుతున్నారు. ఇన్ని వ్యామోహాలుంటే వున్న దానితో తృప్తి వుండదు. వ్యామోహం నెరవేర్చుకోవాలంటే డబ్బు వుండాలి. తన దగ్గర వున్న డబ్బు సరిపోకపోతే తప్పులు, పాపాలు చేస్తారు. తప్పులు, పాపాలు చేయడం వల్ల మళ్ళీ మళ్ళీ భూమ్మీదకు రావలసి వస్తుంది.

భూమ్మీదకు వచ్చి చేయవలసిందేమిటంటే? భూమ్మీదకు రాకుండా వుండే ప్రయత్నం చెయ్యాలి. ఆ ప్రయత్నం చేయకపోతే, ఈ లోక వస్తువులపై వ్యామోహంతో చావు పుట్టుకల విషచక్రంలో బందీ అయిపోతారు. లేకపోతే ఈ వస్తువులపై ఎంత వ్యామోహం వుంటే అన్ని ఎక్కువ జన్మలు పెరుగుతాయి.

ఈ లోక వస్తువులపై వ్యామోహం లేకపోతే జన్మలు తగ్గిపోతాయి.

జంతువులలో ఏ జంతువును చూసినా వాటికి వున్న ఒక్క ఇంద్రియ బలహీనత వల్లే అవి నాశనం అయ్యాయి. కానీ మానవునకు 5 జ్ఞానేంద్రియాల బలహీనత వుంది. వాటి వల్ల ఎంత పతనం అవుతాడో ఆలోచించండి,

| | | | | |
|---|---|---|---|---|
| చూడండి. | శబ్దం | – సంగీతం | – చెవి | – జింక |
| | స్పర్శ | – ఆడ ఏనుగు | – చర్మం | – ఏనుగు |
| | రూపం | – చూడడం | – కండ్లు | – మిడత |
| | రసం | – రుచి | – నాలుక | –చేప |
| | గంధము | – వాసన | – ముక్కు | –తుమ్మెద |

మిడత :– దీపపు కాంతికి ఆకర్షించి దీపంలో పడి మరణిస్తుంది.

అలా ఒక్కొక్క జీవి ఒక్కో ఇంద్రియ బలహీనతతో చనిపోతాయి.

అలాంటిది పంచేంద్రియాలు వున్న మానవునకు ఈ లోక వస్తువులపై ఎంత వ్యామోహం వుటుంది? అందుచేత ఆర్థిక పరిస్థితులు, అనారోగ్య కారణంగా నరకం అనుభవిస్తారు.

చూడండి పుష్పం వికసించినప్పుడు దానిలోని మకరందానికి ఆశపడి తుమ్మెద దానిపై వాలి మకరందాన్ని సేకరిస్తున్నప్పుడు, పువ్వు ముడుచుకోవడంతో తుమ్మెద బయటకు రాలేక మరణిస్తుంది.

అలా ఇంద్రియ వ్యామోహంలో వున్నవాడు, చెయ్యకూడని పాపాలు చేస్తూ చావు, పుట్టుకల విషచక్రంలో బందీ అవుతారు.

ఇంద్రియ వ్యామోహం లేని వారు లోక వస్తువులపై వ్యామోహం వుండదు. వారు పాప కర్మలు చెయ్యరు, ముక్తికర్మలే చేస్తారు.

ఈ ఇంద్రియాలకు మూలం మనస్సు. మనస్సు మలినంగా వుంటే వ్యామోహాలుంటాయి, మనస్సు శుద్ధమవుతే ఇంద్రియ వ్యామోహాలుండవు. గంటలు, గంటలు 'శ్వాస మీద ధ్యాస' వుంచి సాధన చేస్తే చేయకూడని కర్మలు చేయకుండా చేయవలసిన కర్మలే చేస్తారు. వారు జనన మరణ చక్రం నుంచి బయటపడతారు.

వ్యామోహాలు తగ్గిపోవడంతో ఖర్చు మిగులుతుంది, ఆ మిగిలిన ధనాన్ని లోక కళ్యాణానికి ఖర్చు చేస్తారు. ఇలా ఖర్చు చేయడం వల్ల వచ్చే పుణ్యంతో జన్మలు తగ్గిపోతాయి. విచిత్రం ఏమిటంటే "భూమి ఆకర్షణ శక్తి కంటే ఈ లోక వస్తువులపై వుండే ఆకర్షణ చాలా ఎక్కువ". అలాంటి ఆకర్షణ వున్న వారు చావు పుట్టుకల విషచక్రంలో బంధింపబడి నలుగుతుంటారు.

మహాత్ముల సందేశం **"జీవితానికి సరిపడ డబ్బు సంపాదించుకోండి. గుర్తుంచు కోండి, ఈ ప్రపంచం నుండి వెళ్లేటప్పుడు డబ్బు ఉపయోగపడదు, అంతేకాదు డబ్బు భగవంతుని దగ్గరకు చేర్చలేదు. ధనం, సంపదలు భగవంతుని పొందే మార్గంలో అవరోధాలే కలిగిస్తాయి".**

జీవించడానికి కొన్ని అవసరాలున్నాయి. అది కూడు, గూడు, గుడ్డ, తోడు.

ఈ అవసరాలు తీరాలంటే ఎవరికైనా డబ్బు అవసరం అందుచేత జీవించడానికి సరిపడా డబ్బు సంపాదించుకోవాలి. డబ్బు కోట్లు, కోట్లు అవసరం లేదు. కానీ ఎన్ని కోట్లున్నా ఎవరికి తృప్తి లేదు, కారణం కోరికలు.

అందరికంటే గొప్పవాడు కావాలి, అందరిలో గొప్పవాడు అనిపించు కోవాలి అన్నదే ఆశయం. అంతేకాని అవసరం కాదు. ఎందుకు సంపాదిస్తున్నావు అంటే గొప్పవాడు అనిపించుకోవడానికి అంటారు.

సమాజంలో ఒక అలవాటు వుంది.

1) డబ్బు వున్న వాడిని గౌరవించడం

2) డబ్బు వున్నవాడికి విలువనివ్వడం

3) డబ్బు లేనివాడిని చులకనగా చూడటం

4) డబ్బు లేనివాడికి పూచిక పుల్లకు ఇచ్చిన విలువ కూడా ఇవ్వక పోవడం.

అందుచేత డబ్బు వుంటేనే గౌరవం, విలువ అని బ్రతుకంతా ధనం సంపాదించడానికే వెచ్చిస్తున్నారు. భూమ్మీద గొప్పగా వుండాలి అంటే డబ్బు వుండాలి. కానీ ఎవరైనా కొన్నాళ్ళ తర్వాత చనిపోవలసిందే. కానీ పైకి వెళ్ళిన తర్వాత జ్ఞానమున్న వారు పైలోకాలకు వెళతారు. కానీ భూమ్మీద ఎంత ధనం వుంటే అంత గొప్పవాడు. పై లోకాలలో ఎంత జ్ఞానముంటే అంతగొప్పవాడు.

శరీరం వున్నప్పుడు డబ్బుకు విలువ, శరీరం లేనప్పుడు జ్ఞానానికి విలువ, గమనిస్తే అశాశ్వతమైనది డబ్బు, శాశ్వతమైనది ఆత్మజ్ఞానం. శాశ్వతంలో గొప్పవాడు కావాలంటే జ్ఞానం కావాలి.

ఎవరికైనా ఈ భూమ్మీద ఎంతో కాలం నేనుండను అన్న అవగాహనకు వస్తే ధనానికి ప్రాముఖ్యం ఇవ్వరు. పత్రిగారి పరిచయం అయిన తరువాత అర్థం చేసుకున్నాము. మేము దేహాలం కాదు ఆత్మలం అని. ఆత్మలైన మేము భూమి మీద ఎంతో కాలం వుండము, కొంతకాలం అయ్యాక పై లోకాలకు వెళతాము అని తెలుసుకున్నాము. అందుచేత ఇక్కడ పర్మినెంట్‌గా వుండము కాబట్టి ఏది శాశ్వతమో అదే సంపాదిస్తున్నాము.

అంతేకాదు జ్ఞానమే మనల్ని గొప్పవాళ్ళను చేస్తుంది అని తెలుసుకున్నాము. అప్పుడు ధన సంపాదన ఆపి జ్ఞాన సంపాదన మొదలెట్టాము. ఇంకా ఏమి అర్థం అయ్యిందంటే? భూమ్మీద వున్న గొప్పతనం గొప్పతనం కాదు. పైలోకాలలో వుండే గొప్పతనమే అసలైన గొప్పతనము అని తెలుసుకున్నాము.

ఇంకా ఏమి తెలుసుకున్నామంటే డబ్బు వెనకాల పడినా డబ్బు సంపాదించలేము కానీ జ్ఞానం వెనకాల పడితే సంపాదించగలము. దీనికి కారణం డబ్బు సంపాదించాలంటే అర్హత వుండాలి, కృషి చేసినా, కష్టపడినా రాదని తెలుసుకున్నాము.

అంతేకాదు జ్ఞానమన్నది కృషి ద్వారా ఎంతైనా సంపాదించవచ్చు. కృషి అంటే శ్రద్ధ. అందుకే "శ్రద్ధవాన్ లభ్యతే జ్ఞానం" అని శ్రీ కృష్ణుల వారు చెప్పారు.

ఎవరి లక్ష్యం అయినా సరే భగవంతుని పొందాలి. భగవంతుని పొదాలంటే భగవంతుడు వుండే లోకాన్ని చేరాలి, అదే సత్యలోకం. తపోలోకం చేరినా భగవంతుని చేరినట్లు కాదు, సత్యలోకం చేరితేనే భగవంతుని చేరినట్లు, అందుచేత కోట్లున్న వాడికంటే కొద్దిపాటి జ్ఞానమున్న వాడే గొప్ప.

# ఆత్మజ్ఞాని ప్రవర్తన ఎలా వుంటుంది?

1) ఆత్మజ్ఞాని ఆధ్యాత్మిక ప్రయాణంలో లక్ష్యాలు వుంటాయని అర్థం చేసుకుంటాడు.

2) ఆత్మజ్ఞాని సామాన్యుల నుండి, గొప్పవారి నుండి నేర్చుకుంటూ వుంటాడు.

3) ఆత్మజ్ఞాని ఆత్మ విషయాలు తప్ప వేరే విషయాలు మాట్లాడడు, ప్రస్తావించడు.

4) ఆత్మజ్ఞానం తెలిసిన వారితోనే సాంగత్యం చేస్తాడు. ఇతర విషయాలు మాట్లాడడు.

5) ఆత్మ సంబంధమైన ఆధ్యాత్మిక పుస్తకాలు చదువుతాడు. ఇంకా తెలుసుకోవాలని ప్రయత్నిస్తాడు.

6) ఎన్ని పుస్తకాలు చదివితే అంత ఎక్కువ జ్ఞానాన్ని పొందుతామన్నది తెలుసుకుంటాడు.

7) గొప్పవారిని చూసినప్పుడు కాదు, వారి బోధలు విన్నప్పుడు, వారి పుస్తకాలు చదివినప్పుడు మాత్రమే వారి జ్ఞానం అవగాహనలోకి వస్తుంది.

8) అంతేకాదు జ్ఞానం పొందిన వారి సాంగత్యం చేసినా, అటువంటి పుస్తకాలు చదివే వారి సాంగత్యం చేసినా జ్ఞానం పొందవచ్చని తెలుసుకుంటాడు.

9) ఆత్మజ్ఞాని అవసరం లేనిది మన దగ్గరకు రాదు అన్న అవగాహన చేసుకుంటాడు.

10) ఆత్మ జ్ఞాని మనకు మనమే నిర్ణయించుకుని వస్తామన్నది తెలుసుకుంటాడు.

11) ఆత్మజ్ఞాని ఎక్కడికీ వెళ్లవలసిన పని లేదు. ఎక్కడికి వెళ్లినా చేయవలసింది ధ్యానమే, పొందవలసింది జ్ఞానమే అని తెలుస్తుంది. మనము చేయవలసినది చేయడానికి, పొందవలసింది పొందడానికి మన ఇల్లే అనుకూలమైన ప్రదేశమని తెలుసుకుంటాడు.

12) చేసింది చెయ్యడానికి జన్మలుండవు, చెయ్యనిది చెయ్యడానికే కొత్త జన్మ అని అర్థం చేసుకుంటాడు.

13) అనుభవాలు వచ్చిన వాడి కంటే! అనుభవాలు రానివాడు ఇంకా గొప్పవాడని కూడా తెలుసుకుంటాడు.

## తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటి భాగం) | - | రూ.130/- |
| 2) జీవితశాస్త్రం (రెండవ భాగం) | - | రూ.130/- |
| 3) జీవిత సత్యాలు | - | రూ.130/- |
| 4) భగవంతుడంటే | - | రూ.130/- |
| 5) సత్యమార్గం | - | రూ.160/- |
| 6) ఆత్మ శాస్త్రం | - | రూ.130/- |
| 7) ధ్యాన శాస్త్రం | - | రూ.130/- |
| 8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం | - | రూ.160/- |
| 9) ధ్యాన శక్తి | - | రూ.130/- |
| 10) తెలుసుకోండి | - | రూ.130/- |
| 11) జీవిత సూక్ష్మాలు | - | రూ.130/- |
| 12) మరణించకముందే మరణించాలి | - | రూ.130/- |
| 13) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? | - | రూ.120/- |
| 14) గీతాసందేశం | - | రూ.120/- |
| 15) ఉపమాన ధ్యాన సందేశాలు | - | రూ.110/- |
| 16) మెహర్‌బాబా సందేశాలు | - | రూ.100/- |
| 17) కర్మ సిద్ధాంతం | - | రూ.80/- |
| 18) ధ్యానమంటే ? | - | రూ.80/- |
| 19) త్రివిధాలు | - | రూ.80/- |
| 20) ఉత్తమ పురుషుడు | - | రూ.80/- |
| 21) శాస్త్రాల అర్థం- అంతరార్థం | - | రూ.70/- |
| 22) ఆత్మజ్ఞానం ఎందుకు? | - | రూ.70/- |
| 23) జ్ఞాన జ్యోతి | - | రూ.70/- |
| 24) జ్ఞాన కుసుమాలు | - | రూ.70/- |
| 25) మరణం తర్వాత కూడా వచ్చేవి | - | రూ.70/- |
| 26) షిరిడీ సాయి సందేశాలు | - | రూ.70/- |
| 27) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య | - | రూ.70/- |
| 28) బుద్ధుని సందేశాలు | - | రూ.70/- |
| 29) భూతదయే దైవత్వం | - | రూ.70/- |
| 30) దుఃఖ నివారణామార్గం | - | రూ.60/- |
| 31) బ్రహ్మాజ్ఞానం | - | రూ.60/- |
| 32) ధ్యానం (పత్రీజీ) | - | రూ.60/- |
| 33) ధ్యానం వల్లనే జ్ఞానం | - | రూ.60/- |
| 34) అతీంద్రియ శక్తులు | - | రూ.60/- |
| 35) ఆలోచించండి | - | రూ.60/- |
| 36) నిర్వాణ మార్గం | - | రూ.60/- |
| 37) సంకల్పమంటే? | - | రూ.50/- |
| 38) ఈ జీవితం ఎందుకు? | - | రూ.50/- |
| 39) ఆశ్చర్యం... ఆశ్చర్యం | - | రూ.50/- |
| 40) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే | - | రూ.50/- |
| 41) మహాత్ముల సందేశాలు | - | రూ.40/- |
| 42) సత్యం | - | రూ.40/- |
| 43) చక్రాలు | - | రూ.40/- |
| 44) గురువును గుర్తించడం ఎలా? | - | రూ.40/- |
| 45) భాగవత సన్నివేశాల అంతరార్థం | - | రూ.40/- |
| 46) మౌన ధ్యానం | - | రూ.40/- |
| 47) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? | - | రూ.20/- |
| 48) శాకాహారమే మానవాహారం | - | రూ.15/- |
| 49) అహింస మరియు శాఖాహారం | - | రూ.15/- |

## తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) జ్ఞానమాల | - | రూ.70/- |
| 3) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 4) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 5) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 6) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్ : 9440309812, 9490171853



మహాయోగులంతా ఎంతో కష్టపడ్డారు. గొప్ప సాధనలు చేసి, సత్యం తెలుసుకున్నారు, మానవుని దుఃఖానికి కారణం తెలుసుకున్నారు, దుఃఖం నుండి బయటపడే మార్గాన్ని తెలుసుకున్నారు అదే అందరికీ బోధించారు.

- "మానవుని యొక్క గుణాన్ని బట్టే వారు చేసే పనులు ఆధారపడి వుంటాయి, వారి మాటలు ఆధారపడి వుంటాయి, వారు చేసే సేవలు ఆధారపడి వుంటాయి".
- "ఏ మానవుడు అయినా సరే తమ చేతులతో ధర్మంగా సంపాదించి, తాము తిని అందులో నుండి కొంత ఇతరులకు పంచి పెట్టాలి, అలాంటి వారే భగవంతుని పొందగలరు".
- "భగవంతుని ఆశ్రయించాలంటే ఏ జీవికి బాధ కలిగించ కూడదు. జీవహింస చేయకూడదు, ఏ జీవికి హాని తల పెట్టకూడదు"
- "ఎవ్వరి నుండి ఏది ఆశించ కూడదు, అందరికీ సేవ చేయాలి, సహకారం అందించాలి"
- "ఈ లోక వస్తువులపై వ్యామోహం మనల్ని పదే పదే ఈ అధోలోకానికి తీసుకువచ్చి చావు పుట్టుకల విష చక్రంలో బంధిస్తుంది"

\- తటవర్తి వీరరాఘవరావు

రూ.40/-